జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఆనం

◗ విశాఖకు స్వామి నియామకం



ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులయ్యారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమీక్షించడంతో పాటు, వాటి పురోగతిని ఇన్‌ఛార్జి మంత్రి పర్యవేక్షించనున్నారు. జిల్లాకు చెందిన కొండపి ఎమ్మెల్యే, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని విశాఖపట్టణం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అప్రమత్తంగా ఉందాం.. విపత్తును ఎదుర్కొందాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో తలెత్తే ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వాలని అధికార యంత్రాంగానికి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సూచించారు. ఒంగోలు ప్రకాశం భవన్‌లో మంగళవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే మూడు రోజులపాటు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూడాలని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సాగు చేసిన పంటలు దెబ్బతింటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులకు పరిహారం అందించి ఆదుకుంటామని తెలిపారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ, ఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



తుపాను ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి స్వామి.. చిత్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ నాగేశ్వరరావు

రాగల కొద్ది గంటల్లో... ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు!

● ఈదురు గాలులు.. ఆకస్మిక వరదలు
● జిల్లాలో 56,584 మందిపై ప్రభావం
● 15 వేల కుటుంబాలకు సరకులు సిద్ధం
● అప్రమత్తమైన అధికార యంత్రాంగం
● నేడు కూడా విద్యా సంస్థలకు సెలవు



కాలువలా మారిన ఒంగోలు - కర్నూలు ప్రధాన రహదారి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అల్పపీడనం మరికొద్ది గంటల్లో వాయుగుండంగా మారనుందని.. ప్రకాశానికి ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు పొంచి ఉందని విశాఖ వాతావరణ శాఖ కేంద్రం హెచ్చరించింది. ఈ ప్రభావంతో తీర ప్రాంతంలోని ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లో భారీ వర్షం నమోదు కానున్నట్లు ప్రకటించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా, మండల అధికారులు తీర ప్రాంత గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. విపత్తులను ఎదుర్కొనేలా కోస్తా తీరప్రాంత మండలాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు కాలనీ వాసులను తరలించేందుకు 33 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. ఇప్పటికే అయిదు కేంద్రాల్లోకి 214 మందిని తరలించి భోజనం వసతి కల్పించారు. వర్షాల దృష్ట్యా వరుసగా మూడో రోజైన బుధవారం కూడా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవు ప్రకటించారు.

◗ **700 విద్యుత్తు స్తంభాలు.. అందుబాటులో మందులు...:** తీర ప్రాంత గ్రామాల్లో 60 నుంచి 70 కి.మీ మేర బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు నివారించేందుకు 700 స్తంభాలను ఆ శాఖ అధికారులు సిద్ధం చేశారు. తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు 300 మంది కార్మికులను అందుబాటులో ఉంచారు. అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన మందులను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆయా గ్రామాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగర పరిధిలోని పలు కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా పొక్లెయిన్లతో పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు.

ఆ మండలాల్లో తస్మాత్ జాగ్రత్త ..!

రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి అందిన సమాచారం మేరకు అర్ధవీడు, పెద్దదోర్నాల, కంభం, పెద్దారవీడు, మార్కాపురం, రాచర్ల, ముండ్లమూరు మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి ఆకస్మిక వరదలు(ఫ్లాష్ ఫ్లడ్స్) వచ్చే అవకాశం ఉన్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆయా మండలాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

బయటికి రావొద్దంటూ హెచ్చరికలు...

అయిదు తీరప్రాంత మండలాల్లోని 15 వేల కుటుంబాలపై తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందన్న ముందస్తు అంచనాతో నిత్యావసర సరకులను పౌరసరఫరాల శాఖ సిద్ధం చేసింది. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, లీటరు పామోలిన్‌ను పంపిణీ నిమిత్తం ఆయా చౌక ధరల దుకాణాలకు తరలించారు. ఈ నెల 16న భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాలు తీర ప్రాంత మండలాల్లోని 18 గ్రామాలపై., మొత్తం 54 ఆవాస ప్రాంతాల్లోని 56,584 మందిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశమున్నట్లు వివరించారు. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 30 మందితో కూడిన ఎస్డీఆర్ఎఫ్ బృందం జిల్లాకు వచ్చినట్లు తెలిపారు.



తాళ్లూరు మండలం విఠలాపురం దోర్నపు వాగు కాజ్‌వేపై వరద నీటి ఉద్ధృతి.. రాకపోకలు సాగించకుండా పోలీసుల పహారా.. పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ



మత్స్యకారులు వేట నిలిపేయడంతో కొత్తపట్నం సముద్ర తీరాన ఉన్న పడవలు



125 హెక్టార్లలో పంట నష్టం...

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో 125 హెక్టార్లలోని సజ్జ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వెలిగండ్ల, పామూరు, నాగులుప్పలపాడు మండలాల్లోని సజ్జ పంటకు నష్టం వాటిల్లినట్లు జేడీఏ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. వెలిగండ్ల మండలంలో 105 హెక్టార్లు, పామూరు 18, నాగులుప్పలపాడులో రెండు హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వివరించారు. – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

నేలకూలిన వందేళ్ల వేప వృక్షం

త్రిపురాంతకం మండలం మేడపి వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని వడ్డెర ప్రధాన రహదారి ఎదుట ఉన్న వందేళ్ల వృక్షం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం విరిగి నేల కూలింది. ఆ ప్రాంతంలో ఉండే వడియ రాజులు ఈ చెట్టును మహాలక్ష్మమ్మగా కొనియాడుతూ పూజిస్తుంటారు. – త్రిపురాంతకం గ్రామీణం



18 బృందాలు.. 360 మంది సభ్యులు

◗ సహాయక చర్యలకు పోలీసు శాఖ సన్నద్ధం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసు శాఖ సన్నద్ధంగా ఉందని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐ, ఎస్సైలతో జిల్లావ్యాప్తంగా 18 సహాయక బృందాలను ఏర్పాటు చేశామనీ, ఒక్కొక్క బృందంలో సుశిక్షితులైన 20 మంది సిబ్బంది ఉంటారని వివరించారు. లైఫ్ జాకెట్లు, తాళ్లు, డ్రాగన్ లైట్లు, డ్యాటన్లతో పాటు పొక్లెయిన్లు, జేసీబీలను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. వాగులు, వంకలు, కల్వర్టుల వద్ద పోలీసు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. జిల్లా పోలీసు కేంద్రంలో 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్–112 అందుబాటులో ఉంటుందని.. ఎక్కడైనా, ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణ సాయం కోసం **డయల్–112**తో పాటు పోలీసు వాట్సాప్ నంబర్: **9121102266**ను సంప్రదించాలని ఎస్పీ దామోదర్ జిల్లా వాసులకు సూచించారు.



నాగులుప్పలపాడు: మట్టిగుంట వాగు పొంగడంతో నీరు నిలిచి చెరువును తలపిస్తున్న ఉప్పుగుండూరు గంగమ్మ కూడలి

నాగులుప్పలపాడులో అత్యధిక వర్షపాతం...

మండలాల వారీ మి.మి.లలో..

నాగులుప్పలపాడు	130.8
సింగరాయకొండ	122.8
టంగుటూరు	102.0
జరుగుమల్లి	88.6
పొన్నలూరు	86.6
పొదిలి	87.6
తాళ్లూరు	84.4
ముండ్లమూరు	80.4
కొండపి	79.4
ఒంగోలు	76.6
కొత్తపట్నం	75.6
చీమకుర్తి	75.6
మద్దిపాడు	71.8
సంతనూతలపాడు	69.8
మర్రిపూడి	68.4
పీసీపల్లి	63.0
కొనకనమిట్ల	64.6
కనిగిరి	58.6
హనుమంతునిపాడు	57.0
వెలిగండ్ల	52.8
సీఎస్‌పురం	52.2
దర్శి	55.0
దొనకొండ	53.8
కురిచేడు	56.2

(సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు)

తినేదంతా మంచిది కాదు!

● కుళ్లిన మాంసం, పాడైన ఆహారం ● ప్రాణాలతో నిర్వాహకుల చెలగాటం

◗ జిల్లా కేంద్రం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొన్ని హోటళ్లలో అధికారులు ఇటీవల తనిఖీలు చేశారు. కుళ్లిన స్థితిలో ఉన్న కోడి మాంసం, పరోటాలు, కూరగాయలను గుర్తించి చెత్తబుట్టలో పారబోయించారు. సదరు హోటళ్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు.

◗ ఒంగోలు నగరంలోని ఒక జ్యూస్ సెంటర్‌కు సాధారణ వినియోగదారుల్లా అధికారుల బృందం వెళ్లింది. పైకి తాజా పండ్లతో అందంగా అలంకరించినప్పటికీ.. వాటితో కాకుండా ఇతర వాటితో జ్యూస్ చేయడాన్ని గుర్తించి తనిఖీ చేసింది. ఒక పెట్టెలో కుళ్లిన ఆపిల్, దానిమ్మ, బత్తాయి, సపోటా తదితర పండ్లు ఉండటాన్ని గమనించి నిర్వాహకుడికి జరిమానా విధించడంతో పాటు కేసు నమోదు చేసింది.

◗ టంగుటూరులోని ఓ టీ దుకాణంలో కాలం చెల్లిన పాల ప్యాకెట్లను కత్తిరించకుండానే మరగబెడుతుండటాన్ని గమనించి అధికారులు జరిమానా విధించారు.



వినియోగానికి పనికిరాని పండ్లు, పదార్థాలు



ఎక్కువ సార్లు మరగబెట్టిన నూనె నాణ్యతను పరిశీలిస్తున్న ప్రభాకర్

మెరిసేదంతా బంగారం కాదన్నట్లు.. మనం తినేదంతా కూడా మంచి ఆహారమేమీ కాదు మరి. ఉరుకుల పరుగుల జీవితంలో ఏమి తింటున్నామో., ఏమి తాగుతున్నామనే విషయాన్ని చాలామంది పట్టించుకోవడం లేదు. ఆకలైతే ఆ సమయానికి అక్కడ అందుబాటులో ఉన్న ఆహారంతోనో., హోటళ్లు, రెస్టారెంట్లను ఆశ్రయించో., ఆర్డర్లు పెట్టేసో ఆకలి తీర్చుకుంటున్నాం. అలసట, బడలికల నుంచి విముక్తికి పండ్ల రసాలు, శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నాం. అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన మాంసం, కూరగాయలు, పదార్థాలతో తయారు చేసిన వంటలను వడ్డిస్తున్నారు. ఆకర్షణ కోసం పరిమితికి మించి రంగులు వినియోగిస్తున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన పాలు, కుళ్లిన పండ్లతో జ్యూస్‌లు చేసి కాసులు పోగేసుకుంటున్నారు. అధికారులేమో తనిఖీలు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకొంటున్నారు. ధనార్జనకు అలవాటు పడిన వ్యాపారులు ఆ తర్వాత షరామామూలుగానే తమ బాగోతం కొనసాగిస్తున్నారు. – ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, కనిగిరి

ఆకర్షణ మాటున అనారోగ్యం...



కొందరు రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులతో పాటు విందుల వేళ ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా ఉండేందుకు వివిధ రసాయన రంగులు వినియోగిస్తున్నారు. కొన్నింటిని సహజ పద్ధతుల్లో తయారు చేస్తున్నారు. సహజ రంగులుగా పిలిచే వీటితో ఎలాంటి ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదు. రసాయనాలతో తయారు చేసే వాటితో మాత్రం ప్రమాదం తప్పదని కనిగిరి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సృజన తెలిపారు. వీటి వల్ల ఆస్తమా, అలర్జీ, మూత్రపిండ సమస్య, క్యాన్సర్ల బారిన పడే ముప్పు అధికంగా ఉంటుందని వివరించారు.

● **రెడ్ డై 40:** శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయి.

● **బెంజిడీన్:** క్యాన్సర్ భూతానికి దారి తీస్తుంది.

● **రెడ్ 3:** థైరాయిడ్ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంటుంది.

● **ఎల్లో 5, ఎల్లో 11, రెడ్ 33:** ఈ రంగులతో తయారు చేసిన పదార్థాలను తీసుకుంటే అనారోగ్యం పాలవుతారు.

తరచూ తనిఖీలు చేస్తున్నాం...

జిల్లాలోని హోటళ్లు, జ్యూస్ సెంటర్లలో తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్న చోట్ల నమూనాలు సేకరిస్తున్నాం. జిల్లాలో చేసిన తనిఖీల్లో పాడైన మాంసం, కూరగాయలతో వంటలు, కుళ్లిన పండ్లతో జ్యూస్‌లు, కాలం చెల్లిన పాలతో మిల్క్‌షేక్‌లను విక్రయించడంపై కేసులు నమోదు చేశాం. నూనెను మూడు సార్లు మాత్రమే వేడి చేయాల్సి ఉండగా.. అంతకుమించి వాడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి 80 కేసులు నమోదు చేసి రూ.9.43 లక్షలు జరిమానాగా విధించాం.

– ప్రభాకర్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు:	2,000 (సుమారు)
ఒంగోలు నగర జనాభా:	3,20,000 (సుమారు)
నగరంలో గుర్తింపు పొందిన హోటళ్లు:	68
అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నవి:	320
అధికారులు సేకరించిన నమూనాలు:	68 (2023 ఏప్రిల్ నుంచి 24 సెప్టెంబర్ వరకు)

అవినీతి అధికారుల బాగోతంపై ఆరా

ఈనాడు కథనాలకు స్పందన

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఓ అధికారి ఇష్టారీతిన వ్యవహరించారు. నగదు తీసుకుని గ్రామకంఠం, శ్మశాన భూములను ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు చేశారు. మార్కాపురం అటవీ శాఖలోనూ ఓ ఉన్నతాధికారి అడవి దొంగ అవతారమెత్తారు. పట్టుకున్న ఎర్రచందనం దుంగలను దారి మళ్లించారు. ఈ విషయాలను తెలుపుతూ 'వెళ్తూ వెళ్తూ.. నింపుకొన్నారు జేబులు'., 'ఆ అధికారే అడవి దొంగ' శీర్షికలతో 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. ఆయా అధికారుల అవినీతి బాగోతంపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో విచారించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకున్న అక్రమాలపై తహసీల్దార్ కె.చిరంజీవి, అటవీ అధికారి అవినీతి వ్యవహారాలపై ఆ శాఖ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ సహాయకుడు భగత్‌రాజు నివేదికలు రూపొందించి పంపారు.



గూడు చెదిరి.. కన్నీరు మిగిలి

అధికారంలోకి వచ్చాక పేద ప్రజల సొంతింటి కల నిజం చేస్తానంటూ ప్రతిపక్ష నేతగా ప్రగల్భాలు పలికిన జగన్ మోహన్ రెడ్డి.. గద్దెనెక్కాక ఆ గూడు చెదిరి పోయేలా చేశారు. బీదసాదల కోసమని 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వం చేపట్టి దాదాపు పూర్తి చేసిన 'టిడ్కో' ఇళ్లను కక్షగట్టి పాడుబెట్టారు. తల దాచుకోవడానికి తమకంటూ సొంత గూడు సమకూరబోతోందని సంతోషించిన బడుగు జీవుల కళ్లలో కారం కొట్టారు. ఇందుకు నిదర్శనం ఒంగోలు నుంచి కొత్తపట్నం వెళ్లే దారిలో చింతల సమీపంలో ఉన్న గృహ సముదాయం. ఇక్కడ దాదాపు 1,500 గృహాలకు సంబంధించిన నిర్మాణ పనులను నాటి ప్రభుత్వం 75 శాతం మేర పూర్తి చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం... పేదలకు అప్పగించకుండా అయిదేళ్ల పాటు వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో నిర్మాణ సామగ్రి దెబ్బతినడంతో పాటు... గృహ నిర్మాణ సముదాయ ప్రాంగణాలు చిట్టడవుల్లా మారాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గృహ సముదాయాల చుట్టూ మోకాలి లోతు నీరు నిలిచింది. దీంతో భవనాల పటిష్ఠత మరింత దెబ్బతింటోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి మిగతా పనులు త్వరితగతిన పూర్తి చేయించి అప్పగించాలని కోరుతున్నారు.


– ఈనాడు, ఒంగోలు

ధూపదీప నైవేద్యానికి ఊతం

◗ ఇకపై ప్రతినెలా రూ.10 వేలు ◗ జిల్లాలోని 148 ఆలయాలకు లబ్ధి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

జిల్లాలో సుమారు 1,500 వరకు ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. గ్రామీణులు భక్తిభావంతో పూర్వం ఆలయాల నిర్మాణానికి స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చారు. అక్కడ వనరుల ఆధారంగా, మొక్కు చెల్లించుకునే క్రమంలో అప్పట్లో కొద్దిపాటి సొమ్ము డిపాజిట్ చేయడమో లేదా స్థిరాస్తిని ఆలయ నిర్వహణ ఖర్చులకు కేటాయించడమో చేశారు. ఇలాంటివి మూడు వేల వరకు ఉన్నాయి. దాతలు డిపాజిట్ చేసిన నగదుతో కాలక్రమేణా నిర్వహణ భారంగా మారడంతో పాటు, అర్చకులకు గౌరవ వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఇటువంటి ఆలయాలకు చేయూత ఇవ్వాలన్న ఉద్దేశంతో 2007లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ధూప, దీప నైవేద్యాల(డీడీఎన్) కింద నగదు ప్రోత్సాహకాన్ని అందించాలని నిర్ణయించింది. ప్రారంభంలో నెలవారీ రూ. 2,500 అందించింది. 2014లో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ. 5 వేలకు పెంచింది. తాజాగా సదరు సాయాన్ని రూ. 10 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.



◗ **వర్తింపునకు ఇవీ నిబంధనలు...:** డీడీఎన్ పథకం అమలులో పురాతన ఆలయాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. 25 సంవత్సరాల క్రితం నిర్మితమై దేవాదాయ శాఖ చట్ట పరిధిలో ఉండాలి. గ్రామీణ ప్రాంత పరిధిలో ఉండాలి. రెండున్నర ఎకరాల్లోపు మాగాణి లేదా అయిదెకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ.30 వేలలోపు ఆదాయం సమకూరే ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. గ్రామ దేవతల ఆలయాల్లో పూజారుల ఆధ్వర్యంలో నిత్యం కైంకర్యాలు నిర్వహించే వాటినీ పరిగణనలోకి తీసుకుంటారు. డీడీఎన్ కింద అందించే నగదులో ఆలయ అర్చకులకు రూ. 7 వేలు, ఇతర ఖర్చులకు రూ.3 వేలు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద జిల్లాలోని 148 ఆలయాలు లబ్ధి పొందుతున్నాయి. నిబంధనల మార్పుతో జిల్లా వ్యాప్తంగా ఈ విభాగం కిందకు వచ్చే ఆలయాల సంఖ్య మరింత పెరగనుంది.

పన్నుకు సున్నం.. ఖజానాకు కన్నం



◗ విధింపులో సిబ్బంది చేతివాటం

◗ వైకాపా పాలనలో ఇష్టారాజ్యం

గిద్దలూరు నగర పంచాయతీలో ఆస్తిపన్ను విధింపు ఇష్టారాజ్యంగా సాగింది.. వైకాపా పాలనలో పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది అందినదంతా దోచుకున్నారు. ఆ పార్టీ నేతల ఇళ్లకు నామమాత్రంగా విధించి చేతులు దులుపుకున్నారు. కొందరు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆడిన నాటకంతో నగర పంచాయతీ ఆదాయానికి భారీ గండిపడుతోంది.

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం :

చేయి తడపగానే అంకె మారిపోయింది. రూ.వేలల్లో పడాల్సిన పన్ను కాస్తా వందల్లోకి వచ్చేసింది. కొందరు అధికారులు, వైకాపా ప్రజాప్రతినిధులు కుమ్మక్కై గిద్దలూరు నగర పంచాయతీ ఖజానాను గుల్లచేసేశారు. పనిలో పనిగా తమ బంధువులకు కూడా నామమాత్ర పన్ను వేసి పెద్ద మనస్సు చాటుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

అన్నీ మతలబులే..

పన్ను వేసే సమయంలో సిబ్బంది నిబంధనలకు గంతలు కట్టారు. భవన నిర్మాణ విస్తీర్ణం తక్కువ చూపి లబ్ధి పొందారు. ఇక బహుళ అంతస్తులున్నప్పటికీ తక్కువగా చూపి నగర పంచాయతీకి ఆర్థికంగా నష్టం చేకూర్చారు. నగర పంచాయతీలోని శివారు ప్రాంతాల్లో నూతన భవనాల నిర్మాణాలు చేపట్టి వినియోగించుకుంటున్నప్పటికీ నేటికీ పన్ను వేయకుండా మిన్నకుండిపోతున్నారు. వాణిజ్య భవనాలకు నివాస గృహాల కింద పన్ను విధించడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇలాంటి ఎన్నో మతలబులు పట్టణంలో అడుగడుగునా కన్పిస్తున్నాయి.

◗ గిద్దలూరు - ఒంగోలు రహదారిలోని శిల్పా రెస్టారెంట్ సమీపంలో ఓ కౌన్సిలర్ కుటుంబ సభ్యులు నాలుగంతస్తుల భవనం నిర్మించారు. అయితే ఆ భవనానికి నగర పంచాయతీ రెవెన్యూ సిబ్బంది కేవలం గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుకు మాత్రమే అర్ధ సంవత్సరానికి నామమాత్రపు పన్ను వేశారు. మిగతా రెండు అంతస్తులకు పన్ను వేయకుండా నగర పంచాయతీ ఆదాయానికి గండికొట్టారు.

◗ గిద్దలూరు - ఒంగోలు రహదారిలో ఓ శీతల గోదాం నిర్మాణం ఆరు అంతస్తుల్లో చేపట్టారు. అయితే పన్ను వేసే సమయంలో నగర పంచాయతీ రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తక్కువ అంతస్తులు చూపడంతో పాటు విస్తీర్ణాన్ని తగ్గించి పన్ను వేసి నగర పంచాయతీ ఆదాయానికి నష్టం చేకూర్చారు.

◗ గిద్దలూరు నగర పంచాయతీలోని మెయిన్ బజారులో పలు గృహాలను వాణిజ్య దుకాణాలుగా మార్పు చేసినప్పటికీ నేటికి అలాగే నివాసగృహాల కేటగిరీలోనే పన్నులు వసూలు చేస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



శిల్పా రెస్టారెంట్ సమీపంలో తక్కువ పన్ను వేసిన భవనం

తనిఖీలు చేపడితే..

గిద్దలూరు నగర పంచాయతీ అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో అసెస్‌మెంట్లను తనిఖీ చేస్తే రెవెన్యూ సిబ్బంది చేతివాటం బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి. అలాగే నగర పంచాయతీలోని పలు శివారు ప్రాంతాలపై దృష్టి సారిస్తే అక్రమాలు బయట పడనున్నాయి. ఉన్నతాధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హజ్ హౌస్, ఉర్దూ వర్సిటీ నిర్మాణానికి కృషి

పొదిలి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల్లో సంతోషం వెల్లివిరుస్తోందని తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహమ్మద్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు సయ్యద్ ఇమామ్‌సా నివాసంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఒక్కో హామీని నెరవేరుస్తున్నారన్నారు. ప్రధానంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. తమ ఆస్తులకు రక్షణ ఉందన్న భరోసా ప్రజల్లో కలిగించిందన్నారు. హజ్ యాత్రికుల ప్రయాణం తరఫున లక్ష రూపాయలు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారన్నారు. మైనార్టీలకు సంబంధించిన హజ్‌హౌస్, ఉర్దూ యూనివర్సిటీ నిర్మించేందుకు కృషి చేస్తున్నామని, దీనికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. గత వైకాపా పాలనలో ముస్లింలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దుల్హన్ పథకాన్ని కొనసాగించేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. సమస్యలుంటే స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో పరిష్కరించుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్, నాయకులు షబ్బీర్, ముల్లా షబ్బీర్, మస్తాన్‌వలి, ఖాశిం, మెహరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా ముస్లిం మైనార్టీ నేత ముస్తాక్ అహమ్మద్, చిత్రంలో పార్టీ నాయకులు

నిరంతర పరిశోధనతో పరిజ్ఞానం పెంపు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు నిరంతర పరిశోధన, కొత్త విషయాలు తెలుసుకోవడం వల్ల పరిజ్ఞానం పెరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు అన్నారు. 2024 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం మంగళవారం ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమంలో తొలిరోజు ప్రిన్సిపల్ మాట్లాడారు. ముందుగా అన్ని వైద్య విభాగాల ప్రతినిధులను పరిచయం చేశారు. తరువాత కళాశాల, అనుబంధ సంస్థల ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తల్లిదండ్రుల శ్రమ, వారి ఆలోచనలకు తగినట్లు ఎంబీబీఎస్ సీటు సాధించడమే కాక ప్రతిరోజు కొత్త విషయాలను అవగాహన చేసుకోవాలన్నారు. నైపుణ్యం కలిగిన ఆచార్యులు అందుబాటులో ఉన్నారన్నారు. సామాజిక బాధ్యతగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో ఎన్‌రోల్ కావాలన్నారు. సీనియర్లు, జూనియర్ల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఏడుకొండలరావు

పొగాకు వినియోగం తగ్గించేందుకు విభాగం

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న సైకియాట్రిస్ట్ పోస్టుకు టెండర్లు పిలిచినా ఎవరూ ఆసక్తి చూపలేదని సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. 'వ్యసనానికి విముక్తి లేదిక్కడ' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనంపై స్పందించారు. మందులు ప్రభుత్వం నుంచి సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు రావాల్సి ఉందన్నారు. ఇటీవల పొగాకు వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, పొగాకు బారిన పడిన వారికి నికోటిన్ ఫ్రీ డ్రగ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. రోగుల లక్షణాలను బట్టి కొన్ని మందులు స్థానికంగా కొనుగోలు చేస్తామన్నారు. సిబ్బంది వేతనాలు వారి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. వైద్య కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు విచారణలో రుజువు కాలేదని ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు ఈ మేరకు ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ ప్రాంతంలో మద్యం దుకాణం వెంటనే తొలగించాలని స్థానికులు, మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కొండపి మద్దలూరు రోడ్డులో ఉన్న మద్యం దుకాణాన్ని తరలించి గొడుగు పాలెం వెళ్లే మలుపు వద్ద ఓ భవనంలో ఏర్పాటు చేశారు. గుడి, బడి, చర్చి ఉన్న స్థలంలో బెల్టు షాపు ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించాలని కోరుతూ స్టేషన్‌లో అర్జీ అందించారు.

డీఎస్వోగా పద్మశ్రీ బాధ్యతల స్వీకరణ



ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణి(డీఎస్వో)గా పద్మశ్రీ మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె పల్నాడు డీఎస్వోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ప్రకాశానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేశారు. తొలుత డీఎస్వో పద్మశ్రీ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

వాగు కాదు.. కర్నూలు రాచబాట



యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద ఇదీ దుస్థితి



భారీ వర్షాలతో ఒంగోలు - కర్నూలు రహదారి వాగును తలపిస్తోంది. చీమకుర్తి యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద నాలుగడుగుల మేర నీరుండటంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వయంగా సూచించినా ఫలితం లేదు. గ్రానైట్, కంకర మిల్లుల యజమానులతో తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని చోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, చీమకుర్తి

ఇటు సంస్కరణం.. అటు ప్రోత్సాహకం



● సంక్షోభం నుంచి గట్టెక్కేలా అడుగులు ● ప్రభుత్వం రాయితీలిస్తే గ్రానైట్‌కు ప్రాభవం

గత ప్రభుత్వ విధానాలతో కుదేలైన గ్రానైట్ పరిశ్రమ.. ఆ సంక్షోభం నుంచి గట్టెక్కే దిశగా అడుగులేస్తోంది. ఈ మేరకు యాజమాన్యాలు ఓ వైపు సంస్కరణ బాట పట్టింది. ఇదే సమయంలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు దరిచేరితే వేలాదిమంది కార్మికుల జీవితాల్లో వెలుగులీనడంతో పాటు ఖజానాకు ఆదాయం సమకూరే అవకాశముంది.



చీమకుర్తి పరిధిలో విస్తరించిన గ్రానైట్ ఫ్యాక్టరీలు

న్యూస్‌టుడే, చీమకుర్తి :

చీమకుర్తి, కంభంపాడు, బూదవాడ, మర్రిచెట్లపాలెం, పొదిలి మండలం ఏలూరు రోడ్డు ప్రాంతాల్లో దాదాపు 800కు పైగా గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలున్నాయి. సంతనూతలపాడు, ఒంగోలు, గుండ్లాపల్లి పారిశ్రామికవాడ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని కలుపుకుంటే ఈ సంఖ్య 1300కు పైనే ఉంటుంది. వైకాపా ప్రభుత్వం కొలువుదీరక ముందు ఓ వెలుగు వెలిగిన గ్రానైట్ పరిశ్రమ జగన్ హయాంలో ప్రాభవం కోల్పోయింది. దీంతో ఇటు యాజమాన్యాలతో పాటు కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. కొన్ని యూనిట్లు మూతపడ్డాయి. గిట్టుబాటు ధరలు లేక పరిశ్రమల్లో నిల్వలు పేరుకు పోతున్నాయి.

కొత్త దిశలో పయనిస్తూ..

గత ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాలతో విద్యుత్తు బిల్లులు, ఈఎంఐలు, ఇతర నిర్వహణ ఖర్చులను కూడా భరించలేని స్థితి ఎదురైంది. దీంతో గత్యంతరం లేక వచ్చిందే ధర అన్న చందంగా యాజమాన్యాలు స్లాబులు అమ్మకాలు చేస్తున్నాయి. కొనుగోలుదారులు రింగ్ అవ్వడంతో వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చీమకుర్తి, కంభంపాడు, బూదవాడు, ఏలూరు రోడ్డు ప్రాంతాల గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘాలకు ఎన్నికైన కొత్త కార్యవర్గాలు పరిశ్రమకు ఆదివారాలు సెలవులు ప్రకటించాలని నిర్ణయించాయి. ఆమేరకు గత రెండు నెలలుగా అమలుచేస్తున్నారు. ఎడ్జి కటింగ్ యంత్రాలకు మెటీరియల్ ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. బిల్లుల విధానాన్ని పక్కాగా అమలుచేసేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

చవకగా విద్యుత్తు అందిస్తే..

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రానైట్ ఫ్యాక్టరీలకు విద్యుత్తును చవక ధరకు అందిస్తామని చీమకుర్తిలో పాదయాత్ర సందర్భంగా లోకేశ్ ప్రకటించారు. ఆయన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాక పరిశ్రమల ప్రతినిధులు కలిసి సమస్యలు విన్నవించారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన రాయితీలు, పావలా వడ్డీ మొత్తాలు, విద్యుత్తు రాయితీలను చెల్లింపచేసే దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు. ఇవన్నీ కార్యరూపం దాల్చితే గెలాక్సీ పురి మళ్లీ కాంతులీనే అవకాశముంది.

కేసులతో ఉద్యమాలను ఆపలేరు



మార్కాపురం న్యాయస్థానం వద్ద సీపీఐ, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు

మార్కాపురం, న్యూస్‌టుడే: పోలీసుల అక్రమ కేసులతో ఉద్యమాలు, ప్రజా పోరాటాలను ఆపలేరని సీపీఐ రాష్ట్ర నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఎం జిల్లా నాయకుడు దగ్గుపాటి సోమయ్య అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు కూడలిలో సీపీఐ, సీపీఎం నాయకులు మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా అమలుచేయాలంటూ 2016లో తాము మార్కాపురం పట్టణంలో ఉద్యమిస్తే పోలీసులు అప్పట్లో అక్రమ కేసులు పెట్టారన్నారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఎలాంటి ఆధారాలు లేవంటూ కేసును కొట్టివేశారన్నారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు అందె నాసరయ్య, షేక్ కాశిం, డీకేఎం. రఫీ, సిత్తారి పెద్దన్న, గుమ్మా బాల నాగయ్య, కొండేటి నగేష్, డి.అల్లూరయ్య తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

కురిచేడు, న్యూస్‌టుడే: పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో ముగ్గురు వ్యక్తులతోపాటు ఓ బాలుడు గాయపడిన సంఘటన మండలంలోని కురిచేడులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..కురిచేడు గ్రామానికి చెందిన అబ్దుల్ అనే బాలుడు తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా, ఓ పిచ్చికుక్క దాడి చేయడంతో ఛాతీపైన గాయాలయ్యాయి. అనంతరం దర్గా బజార్‌లో మరో ఇద్దరి మహిళలతోపాటు ఓ వృద్ధురాలిని గాయపరిచింది. గ్రామంలో గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయని మండల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హుండీ చోరీ



పగులగొట్టిన హుండీని పరిశీలిస్తున్న గ్రామస్థులు

కురిచేడు, న్యూస్‌టుడే: ఆలయంలో హుండీ చోరీకి గురైన సంఘటన మండలంలోని నమశ్శివాయపురంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..నమశ్శివాయపురంలోని అంకాల పరమేశ్వరీ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని చోరీ చేసి ఆలయానికి కొంత దూరంలో పగులగొట్టి అందులో అధిక మొత్తంలో ఉన్న నగదు, బంగారం, ముడుపులు దోచుకెళ్లారు. గత ఏడాదిన్నరగా భక్తులు అమ్మవారి మొక్కు నిమిత్తం బంగారు వస్తువులు, నగదు హుండీలో వేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

వారంలోగా పరిహారం చెల్లింపునకు చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం నిర్మాణంలో భూ సేకరణ నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. అమరావతి నుంచి సంబంధిత రైలు మార్గం వెళ్తున్న జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. కనిగిరి, పామూరు మండలాల్లో పరిహారం చెల్లింపులో జాప్యంపై ఆరా తీశారు. వారంలోపు సదరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం భూ సేకరణ విభాగం పర్యవేక్షకులు సంజీవరావుతో కలెక్టర్, జేసీ సమీక్ష నిర్వహించారు.

కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

కొత్తపట్నం: భారీ వర్షాల నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు మెరుగైన వసతులతోపాటు, నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కొత్తపట్నంలోని జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం రాత్రి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు సమకూర్చిన వసతుల గురించి తెలుసుకున్నారు. భోజన సదుపాయాలు ఎలా ఉన్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావం తొలిగే వరకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు. బుధవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా రెండు కేంద్రాల్లో 75 మంది ఆశ్రయం పొందుతున్నట్లు తహసీల్దార్ పి.మధుసూదనరావు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు తెలిపారు. వారి కి 24 గంటలు వైద్యసేవలు అందించేలా శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు ఉన్నారు.



కొత్తపట్నం పునరావాస కేంద్రంలో సదుపాయాల గురించి ఆరాతీస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మంత్రి సత్యకుమార్ పర్యటన వాయిదా

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ నెల 17న యర్రగొండపాలెం కొలుకులలో నిర్వహించే పర్యటన వాయిదా పడినట్లు భాజపా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు ఆరె.రమణయ్య మంగళవారం తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంత్రి పర్యటన నవంబర్ రెండో వారానికి వాయిదా పడినట్లు ఆయన చెప్పారు.

అనుమతిలేని గ్రానైట్ కంటెయినర్ల పట్టివేత

ఒంగోలు, ఈనాడు : చీమకుర్తి మండల పులికొండ, ఆర్ఎల్‌పురం ప్రాంతాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి తగిన అనుమతి పత్రాలు లేకుండా గ్రానైట్ స్లాబ్‌లను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు కంటెయినర్లను పట్టుకున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తగిన వేబిల్లులు లేకుండా ఆయా ఫ్యాక్టరీల నుంచి గ్రానైట్ స్లాబులను రవాణా చేస్తున్న ఈ వాహనాలను స్వాధీనం లోకి తీసుకున్నామన్నారు. సహాయ జియాలజిస్టు సురేష్ కుమార్ రెడ్డి, సాంకేతిక సహాయకులు కృష్ణారెడ్డి, రాజు నాయుడు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం.. దోషికి పదేళ్ల కారాగారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడి.. ఆపై అపహరించి పెళ్లి చేసుకున్న నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 15,000 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత కథనం ప్రకారం.. సింగరాయకొండ ప్రాంతానికి చెందిన మండే అనిల్ (22) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలో తాపీ మేస్త్రీగా స్థిరపడ్డాడు. 2019లో ప్రేమ పేరిట ఓ బాలిక(16)ను మభ్యపెట్టి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కొన్నిరోజుల తర్వాత ఆమెను అపహరించి వనస్థలిపురంలోని ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో వనస్థలిపురం పోలీసులు.. అత్యాచారం, అపహరణ, పోక్సో కేసులు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తుది తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.10 లక్షలు పరిహారాన్ని మంజూరుచేశారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాధితురాలి వైద్యం, పునరావాసానికి వినియోగించాలని తీర్పులో పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఉపాధ్యాయురాలికి జైలు

కనిగిరి, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితురాలు కుమ్మరికుంట ప్రమీలకు రూ.8 లక్షల జరిమానా, ఏడాది జైలుశిక్ష విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర తీర్పునిచ్చారు. కనిగిరి మండలం గురవాజీపేటకు చెందిన ఉపాధ్యాయురాలు ప్రమీల బొమ్మిరెడ్డిపల్లికి చెందిన తూము ఆదిరెడ్డి వద్ద రూ. 5.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఈ నగదు చెల్లించే నిమిత్తం రూ.8 లక్షలకు చెక్కును తిరిగి ఆదిరెడ్డికి ఇచ్చారు. అది బ్యాంకులో చెల్లకపోవడంతో బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగళవారం ఈ కేసు విచారణకు రాగా, ఆమెపై నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తు తీర్పునిచ్చారు.

మరో కేసులోనూ ఆమెకు శిక్ష

కుమ్మరికుంట ప్రమీలకు మరో కేసులోనూ శిక్ష విధించారు. వెలిగండ్ల మండలం తమ్మినేనిపల్లికి చెందిన తమ్మినేని ఫణీంద్ర నుంచి గతంలో ఆమె రూ. 3.25 లక్షలు అప్పుగా తీసుకున్నారు. దీని తాలూకా అసలు, వడ్డీతో సహా రూ. 5 లక్షల చెక్కును ఆమె అందజేయగా, అది కాస్తా బౌన్స్ అయ్యింది. దీంతో నిందితురాలు ప్రమీలకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 లక్షలు పరిహారం విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్రతీర్పునిచ్చారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 157, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 259



రాచర్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, పక్కన అధికారులు, నాయకులు



మార్కాపురం : పెద్దనాగులవరంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం

• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

బురద దారిలో నాట్లు వేసి నిరసన



పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ పరిధిలోని అయినముక్కల బీసీ కాలనీలోని అంతర్గత రహదారులు వర్షానికి బురదమయమై నడిచేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రహదారులను సిమెంటు రహదారులుగా వేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదు. దీంతో ఆ వీధి మహిళలు మంగళవారం బురదలో మిరప నాట్లు వేసి నిరసన తెలిపారు. – పెద్దదోర్నాల, న్యూస్‌టుడే

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కంభం (రాచర్ల), మార్కాపురం, పెద్దారవీడు : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రాచర్ల, పలుగుంటిపల్లి, ఫారం గ్రామాల్లో రూ.40 లక్షలతో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీఈ సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ జోసఫ్‌కుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ విజయకుమారి, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ◗ మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు, రాయవరం, పెద్దనాగులవరం, బోడపాడు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయా గ్రామాల్లో సీసీ రహదారులకు ఏర్పాటు చేసిన శిలఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వై.భాగ్యవతి, జవ్వాజి రామాంజులురెడ్డి, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.◗ పెద్దారవీడు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన పల్లె పండుగ వారోత్సవాల్లో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. సిమెంటు రహదారుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



పెద్దారవీడులో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

కంభం (రాచర్ల), పుల్లలచెరువు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. రాచర్ల మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పేదలు, రైతులు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం : పుల్లలచెరువు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. అధికారులు గైర్హాజరైనా పట్టించుకోలేదు. గత రెండు సంవత్సరాలుగా ఉన్న పనుల గురించి వివరించటమే తప్ప కొత్త పనుల ప్రస్తావన రాలేదు. తమ సమస్యలను తెలిపినా పట్టించుకునేవారే లేరని సభ్యులు వాపోయారు. సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

పేదల ఇళ్ల బిల్లులకు మోక్షం

◗ ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులకు ఊరట

◗ కూటమి ప్రభుత్వరాకతో మంజూరు

మార్కాపురం, న్యూస్‌టుడే:

తెదేపా ప్రభుత్వ హయంలో 2014- 2019 మధ్యలో ఎన్టీఆర్ గృహాలు నిర్మాణం చేసుకున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తెదేపా హాయంలో నిర్మాణం చేసుకున్నారనే అక్కసుతో గత వైకాపా ప్రభుత్వం పేదలకు బిల్లులు చెల్లించకుండా నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో రూ.16.47 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయి. కూటమి రాకతో వీరి ఇక్కట్లు తొలగిపోయాయి. గృహనిర్మాణశాఖ అధికారులు ఇప్పటికే సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో పెండింగ్ బిల్లులు జమ కానున్నాయి.

పశ్చిమంలో రూ.16.47కోట్ల బిల్లులు పెండింగ్

తెదేపా ప్రభుత్వ హయంలో మార్కాపురం డివిజన్‌లో ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల వివరాలపై పూర్తి స్థాయిలో సర్వే చేసిన అధికారులు అప్పట్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారు, మధ్యలో అసంపూర్తిగా ఉన్న వారు, స్లాబ్ వరకు, పూర్తి చేసుకున్న వారి, బిల్లులు రాని వారి ఇళ్ల వివరాలను అధికారులు సేకరించారు. 2019లో ఎన్నికలు రావడంతో తెదేపా ప్రభుత్వం మారిపోయి వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలో వైకాపా ప్రభుత్వం తెదేపా ప్రభుత్వ హయంలో చేపట్టిన నిర్మాణాలకు మధ్యలోనే నిలిచిపోయిన వారికి బిల్లులు చెల్లించలేదు. 2014-19 మధ్య అయిదు ఏళ్ల కాలంలో మార్కాపురం నియోజకవర్గంలో 2,724 ఇళ్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 3,843 గృహాలకు బిల్లులు అందాల్సి ఉందని అధికారులు ఇటీవల నిర్వహించిన సర్వేలో తేల్చారు. గిద్దలూరు నియోజకవర్గంలో 4,094 గృహాలకు బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారులు సర్వేలో గుర్తించారు. డివిజన్‌లో మొత్తం 10,661 నివాసాలకు బిల్లులు చెల్లించాలి. డివిజన్ వ్యాప్తంగా మొత్తం రూ.16.47 కోట్ల బిల్లులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.



పెండింగ్‌లో ఉన్న ఎన్టీఆర్ గృహాల బిల్లులపై పరిశీలన చేస్తున్న డీఈ పవన్‌కుమార్



రాయవరంలో నిర్మాణంలో ఉన్న ఇంటి నిర్మాణాలు

సర్వే పూర్తి చేశాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కాపురం పశ్చిమ ప్రకాశంలో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారి వివరాలను గత నెల రోజులుగా సర్వే చేశాం. ఈ సర్వేలో ఎంత మందికి బేస్‌మట్టంతో పాటు రూఫ్‌లెవల్, స్లాబ్ లెవల్, పూర్తి బిల్లు ఇవ్వాల్సి ఉంది తదితర వివరాలన్నీ సేకరించాం. గృహనిర్మాణశాఖ డివిజన్ స్థాయి అధికారులు జిల్లా కేంద్రానికి నివేదికను పంపించారు. త్వరలోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెండింగ్ బిల్లులు జమ అవుతాయి.

– పవన్‌కుమార్, డీఈ, గృహనిర్మాణశాఖ, మార్కాపురం

మండలం	బిల్లులు చెల్లించాల్సిన ఇళ్లు
దోర్నాల	582
పెద్దారవీడు	421
పుల్లలచెరువు	952
త్రిపురాంతకం	812
యర్రగొండపాలెం	1076
మార్కాపురం	639
తర్లుపాడు	609
కొనకనమిట్ల	705
పొదిలి	771
అర్ధవీడు	622
బేస్తవారపేట	679
కంభం	595
రాచర్ల	663
కొమరోలు	614
గిద్దలూరు	921
మొత్తం	10,661

శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రజలకు నీరందించే ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దాని పిల్లర్లు పగిలిపోయి ఇనుప చువ్వలు వేలాడుతున్నాయి. ఏ క్షణానైనా పడే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నెలకొంది. పెద్దదోర్నాల ప్రజలకు సాగర్ నీరందించేందుకు రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించింది. మండలానికి సాగర్ జలాలు అందకపోవడంతో ఆ ట్యాంకుకు ఆ నీరందలేదు. దీంతో స్థానిక డీప్‌బోర్లలోని నీటిని ట్యాంకులోకి ఎక్కించి పైపులైను ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. అయిదేళ్ల క్రితం ఆ ట్యాంకు పిల్లర్లు శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు బైటకు వచ్చి కూలే దశకు చేరింది. అది పాఠశాల మైదానంలో ఉండటంతో అటువైపు వెళ్లే పిల్లల మీద కూలే అవకాశం ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకు



పిల్లర్లు పగిలి బయట పడ్డ ఇనుప చువ్వలు

పాఠశాల ప్రాంతంలో మద్యం దుకాణం వద్దు

కంభం, న్యూస్‌టుడే : స్థానిక బస్టాండ్ సమీపంలోని షిర్డీ సాయి నగర్‌కు వెళ్లే దారిలోని ఆర్టీసీ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ ఆ ప్రాంత వాసులు మంగళవారం ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు 400 కుటుంబాలు, వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఓ ప్రైవేటు పాఠశాల ఉందని చెప్పారు. మద్యం తాగిన వారు అర్ధనగ్నంగా తూలుతూ మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు.



ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న షిర్డీసాయి నగర్ వాసులు

చిట్టడవిలా.. కల్యాణ మండప ప్రాంగణం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : పేదలు వివాహాలు చేసుకునేందుకు వీలుగా సుమారు 10 సంవత్సరాల క్రితం గిద్దలూరు నగర పంచాయతీ పీఆర్‌కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. ఎకరా స్థలం కల్యాణ మండపానికి కేటాయించి అందులో ఓ షెడ్డు, వంట గదుల నిర్మాణం పూర్తిచేశారు. అటు తరువాత ప్రహరీ నిర్మాణం పూర్తిచేసినప్పటికీ నిర్వహణ చేపట్టక పోవడంతో ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తోంది. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అద్దెకు తీసుకున్నప్పటికీ ఒక్క వివాహం కూడా జరగని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు కల్యాణ మండపంలో పేదలకు తక్కువ ధరకే కల్యాణ మండపం వినియోగించుకోనేలా మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన తితిదే కల్యాణ భవన ఆవరణ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే



సమస్య : కొలుకుల గ్రామంలోని వై.పాలెం వెళ్లే తారు రోడ్డు నుంచి ఎస్సీ పాలెం వెంట ఉన్న మట్టి రోడ్డు గోతులు పడి అధ్వానంగా ఉంది. వర్షం పడితే నడిచేందుకూ వీల్లేకుండా ఉంది. మరమ్మతులు చేపట్టాలి.

– స్థానికులు

సమాధానం : సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులొచ్చాయి. త్వరలో పనులు ప్రారంభించి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి.

పంటలకు వరుణ గండం

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మెట్ట, వాణిజ్యం పంటలు ముప్పు వాకిట ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఎడతెరపి లేని జల్లుల గత వారంలో కురిసిన వర్షాల నేపథ్యంలో పంటల పొలాలన్నీ ఉరకెత్తుతున్నాయి. ప్రధానంగా చేతికొచ్చే దశలోని పొగాకు పంట దెబ్బతింటోంది. ఉరకెత్తి ఎర్రగా మారి మొక్కలు చనిపోతున్న పరిస్థితి నెలకొంది. సేద్యం చేసేందుకు వీలు లేకపోవడంతో కొన్నిచోట్ల విపరీతంగా కలుపు పెరిగిపోయి పంటను దెబ్బతీస్తోంది. ఈ ఏడాది పత్తి స్థానంలో పొగాకు సాగు గణనీయస్థాయిలో పెరిగింది. తాజా వర్షాలు పొగాకు పంటకు గండంలా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవే జల్లులు కొనసాగితే దిగుబడి తగ్గిపోయి నష్టాలపాలవక తప్పదని అన్నదాతలు వాపోతున్నారు.



మిరప పంటలో నీరు నిలవడంతో ఉరకెత్తి నేలవాలుతున్న మొక్కలు

రెండో రోజూ.. వదలని వర్షం

పొదిలి, కంభం, న్యూస్‌టుడే: పొదిలిలో మంగళవారం కూడా ఓ మోస్తరు వర్షం పడింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లోని వర్షపునీరు నిలబడింది. మధ్యాహ్నం కొద్దిసేపు తెరపిచ్చినప్పటికీ సాయంత్రం మళ్లీ జల్లులు పడ్డాయి. ప్రధాన రహదారిపై నిలిచిన నీటిని నగర పంచాయతీ అధికారులు ప్రొక్లయిన్‌తో గుంతలు తీయి నీరుపోయేలా చేశారు. ◗ కంభం మండలం యర్రబాలెం సమీపంలోని గుండ్లకమ్మ వాగును ఎస్సై నరసింహారావుతో కలిసి తహసీల్దార్ కిరణ్ పరిశీలించారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.



పొదిలి రహదారిపై నిలిచిన నీరు

చేతుల పరిశుభ్రతపై అవగాహన

బేస్తవారపేట, న్యూస్‌టుడే: సబ్బుతో చేతులను శుభ్రపరచుకోవడం ద్వారా అంటు వ్యాధులు, అనారోగ్యాలు, హానికరమైన క్రిముల వ్యాప్తి నుంచి రక్షణ కల్పిస్తుందని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య పేర్కొన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బేస్తవారపేటలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ఆవరణలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, యువతి, యువకుల చేతులను సబ్బుతో కడిగించి దాని వలన కలిగే ఆరోగ్య ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలు, యువతి, యువకులు పాల్గొన్నారు.



సబ్బుతో చేతులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

అబ్దుల్ కలాం దేశానికే ఆదర్శనీయం

పొదిలి, మార్కాపురం, యర్రగొండపాలెం : దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికే ఆదర్శప్రాయమని తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం పొదిలి వచ్చిన ఆయన కొత్తూరులో తెదేపా ముస్లింమైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కలాం చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకున్నారు. ◗ మార్కాపురం పట్టణంలోని ఇందిరా, జార్జి కళాశాలల్లో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ◗ యర్రగొండపాలెంలోని బీసీ కాలనీలో కలాం చిత్రపటానికి భాజపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ముస్లిమ్ యూత్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు షేక్.ఇస్మాయిల్ ఆధ్వర్యంలో వైద్యశాలలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు.

సస్య రక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

కంభం, బేస్తవారపేట, మార్కాపురం, కొనకనమిట్ల, పొదిలి గ్రామీణం : సస్య రక్షణ చర్యలతో తెగుళ్ల నివారించవచ్చని వ్యవసాయాధికారిణి స్వరూప పేర్కొన్నారు. కంభం మండలంలోని దరగా, హజరత్‌గూడెం గ్రామాల్లో మంగళవారం జొన్న, పసుపు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.◗ బేస్తవారపేట, సోమవారపేటలో ఏవో జక్కం మెర్సీ ఉద్యాన విస్తరణ అధికారి శేషగిరి కంది, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ◗ మార్కాపురం మండలంలోని భూపతిపల్లె, బొందలపాడు గ్రామాల్లో మండల వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు దేవిరెడ్డి శ్రీనివాసులు, రమేష్‌బాబు పర్యటించారు. ◗ కొనకొనమిట్ల మండలంలోని క్రాటకుంట, గరిమినపెంట సాగవుతున్న వివిధ పంటలన దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ పరిశీలించారు. ◗ పొదిలి మండలంలోని సూదనగుంటలో ఏవో జైనుల్లాబ్దీన్ కంది, సజ్జ పంటలను పరిశీలించి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



పొదిలి గ్రామీణం : సూదనగుంటలో రైతులకు సూచనలిస్తున్న ఏవో జైనుల్లాబ్దీన్

ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడి మృతి

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రిపురాంతకం ఆలయాల ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు బీమిశెట్టి కోటయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మండలంలోని కేశినేనిపల్లి పంచాయతీ పరిధిలోని బీఆర్ జంక్షన్‌కు చెందిన కోటయ్య వైకాపా నాయకుడు కాగా 2019లో ట్రస్టు బోర్డు సభ్యుడిగా సేవలు అందించారు. ఈయన మృతి పట్ల సీపీఐ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శనగ విత్తన నమోదు ప్రారంభం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రబీలో రైతులు శనగ పంట సాగు చేసుకొనేందుకు వీలుగా ముందస్తుగా వ్యవసాయశాఖ అధికారులు శనగ విత్తన పంపిణీ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. రైతులకు జెజీ-11, కాక్-2 రకం విత్తనాలు అందజేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి యేరువ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. గిద్దలూరు మండలంలో 4,500 ఎకరాల్లో రైతులు శనగ పంట సాగు చేసేందుకు వీలుగా విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు.



విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం నాయకులు డి.సోమయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డీకెఎం.రఫీ, యూనియన్ నాయకులు కె.సుబ్బరాయుడు, జి.హరి, ఎస్‌కె.షబ్బీర్, రమణ, యూసఫ్, అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తారు రోడ్లు అధ్వానం.. రాకపోకలకు కష్టం

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే :

మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించే తారు రహదారులు అధ్వానంగా మారాయి. తారు లేచి పోయి కంకర రాళ్ల మొన తేలడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు పంచర్లు అవుతూ మరమ్మతులకు గురవుతూ వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

◗ దూపాడు వద్ద హైవే రహదారి నుంచి నడిగడ్డ గ్రామానికి నిర్మించిన తారు రహదారి అధ్వానంగా తయారైంది. 2011లో రైడ్ పథకం ద్వారా రూ. 146 లక్షల నాబార్డు నిధులతో చెరువు కట్ట మీదుగా మూడున్నర కిలోమీటర్ల మేర గ్రామం వరకు వేసిన తారు రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలకు మరమ్మతులు నిర్వహించనందున తారు, కంకర లేచి పోయి గుంతలు పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలు గుంతలతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గుంతల నిండా నీరు చేరడంతో పాటు వేసవి కాలంలో దుమ్ము లేస్తుండటంతో నడిగడ్డ గ్రామ ప్రజలకు అవస్థలు నిత్యకృత్యంగా మారాయి.

◗ జాతీయ రహదారి 544-డి నుంచి కొత్త అన్నసముద్రం మీదుగా పాత అన్నసముద్రం వరకు పదేళ్ల క్రితం నిర్మించిన తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో కొత్త, పాత అన్నసముద్రం గ్రామాలతో పాటు మేడపి గ్రామస్థులకు రాకపోకలు సాగించాలంటే నరకప్రాయంగా మారింది.

◗ కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిలోని జి.ఉమ్మడివరం సమీపం నుంచి వెంగాయపాలెం వరకు నిర్మించిన తారు రోడ్డు ఆరేళ్లకే దెబ్బతింది. చాలా చోట్ల తారు లేచి పోయి గుంతలు ఏర్పడగా అక్కడక్కడ కంకర రాళ్లు లేచి మొనతేలాయి. ఆరేళ్లకు తారు రోడ్డు దెబ్బతినడం ఏమిటని సంబంధిత శాఖ ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేయించాలని వెంగాయపాలెం గ్రామస్థులు కోరుతున్నారు. నిర్వహణ లేక దెబ్బతిన్న తారు రహదారులను నూతనంగా కొలువు తీరిన తెదేపా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆధునికీకరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తారు లేచిపోయి గుంతలమయంగా మారిన వెంగాయపాలెం దారి



తారు రోడ్డు రూపు రేఖలు కోల్పోయిన అన్నసముద్రం రహదారి

మార్కాపురం మున్సిపల్ డీఈగా శ్రీనివాసులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం మున్సిపల్ **డీఈగా ఏ.శ్రీనివాసులు** మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు టీడ్కో విభాగంలో పనిచేస్తూ బదిలీపై మార్కాపురం మున్సిపాలిటీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



కంభం, న్యూస్‌టుడే : మండలంలోని యర్రబాలెం, పెద్దనల్లకాలువ, దరగా, ఎల్.కోట పంచాయతీల నూతన కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ప్రసన్న, సువర్ణ మంగళవారం విధుల్లో చేరారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో వీరభద్రాచారిని కలిసి సత్కరించారు.

డీఎస్సీకు ఉచిత శిక్షణ.. దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డీఎస్సీ కోసం శిక్షణ తీసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఉచితంగా ప్రభుత్వమే శిక్షణ కల్పించేందుకు ముందుకు వచ్చిందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మార్కాపురం సాంఘిక సంక్షేమ సహాయ అధికారి ఎన్.వి.అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా..

కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

టంగుటూరు, న్యూస్‌టుడే:

సమస్య: టంగుటూరు మండలం జమ్ములపాలెం ఎస్సీకాలనీ, గ్రామ శివారున కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాల వెంట పడుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- సుబ్బారావు, గ్రామస్థుడు

సమాధానం: సమస్య తమ దృష్టికి వచ్చింది. విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, జమ్ములపాలెం పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని తంగెళ్ల పంచాయతీలోని ఎస్సీ కాలనీలో కాలువలో చెత్తాచెదారంతో నిండిపోయింది. - దాసు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెంటనే కాలువలు శుభ్రం చేయిస్తాం.

-సాంబశివరావు, ఈవోఆర్డీ

పల్లె పండగతో పంచాయతీలకు మహర్దశ

హనుమంతునిపాడు, దర్శి, తాళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమంతో పంచాయతీలకు మహర్దశ కలగనుందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి స్పష్టం చేశారు. హెచ్‌ఎంపాడు మండలంలోని ఎలికావారిపల్లిలో మంగళవారం రూ.30 లక్షలతో తలపెట్టిన ఆ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నందనవనం పంచాయతీలోని నందనవనం- ఉమ్మనపల్లికి రహదారికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ అయిదేళ్లలో పూర్తి చేసి మాట నిలబెట్టుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు, తహసీల్దారు దిలీప్‌కుమార్, ఎంపీపీ గాయం సావిత్రి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ❖ 'పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం దర్శి మండలంలోని జముకులదిన్నె, సామంతపూడి, పాపిరెడ్డిపాలెం, బండివెలిగండ్ల, తుమ్మెదలపాడు తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు లు భూమి పూజ నిర్వహించారు. ❖ తాళ్లూరు మండలంలోని బెల్లంకొండవారిపాలెం, దోసకాయలపాడు, లక్కవరం తదితర ప్రాంతాల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి అధికారులు, నాయకులు పూజలు నిర్వహించారు.



హెచ్‌ఎంపాడు: ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, నాయకులు



దర్శి మండలం సామంతపూడిలో భూమి పూజ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

22 దరఖాస్తులు రాక

తాళ్లూరు, న్యూస్‌టుడే : తాళ్లూరులోని కేజీబీవీ (టైప్-4) వసతిగృహంలో సిబ్బంది నియామకం కోసం దరఖాస్తుల స్వీకరణ మంగళవారంతో ముగిసింది. ఇక్కడ నాలుగు పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ జారీ చేయగా 22మంది దరఖాస్తులను అందజేశారని ఎంఈఓలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకరరావులు తెలిపారు.

ఈ పంట నమోదు జాబితా ప్రదర్శన

మర్రిపూడి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పైర్లను ఈ పంట నమోదు జాబితాను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఏవో వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు జాబితాను పరిశీలించి ఏమైనా తప్పులు ఉంటే ఈ నెల 16వ తేదీలోపు వీఏఏలను కలిసి సరిచేయించుకోవాలన్నారు.

పట్టణవాసం... ప్రగతికి దూరం..

- కొత్తూరులో సమస్యల తిష్ట



బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు

మున్సిపాలిటీ - కనిగిరి
ప్రాంతం - కొత్తూరు
కుటుంబాలు - 500
జనాభా - 2 వేలు



నిరుపయోగంగా మంచినీటి పథకం

కాలనీ కష్టాలు

కనిగిరి, న్యూస్‌టుడే:

పేరుకు పట్టణ వాసం.. సమస్యలు మాత్రం ఏళ్లుగా తిష్ట వేశాయి. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. కనీస సదుపాయాలు కరవై ఈ ప్రాంత ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇది కనిగిరి పట్టణంలోని కొత్తూరు పరిస్థితి.

వర్షం వస్తే బురదమయంగా..

పట్టణ పరిధిలో ఉన్న కొత్తూరులో అధికంగా కార్మికులు, రైతులు, వ్యాపారులు నివాసముంటున్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా తయారైంది. ప్రధానంగా వీధిదీపాల సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో పగలు రాత్రి వీధి దీపాలు వెలుగుతుండగా.. మరికొన్ని చోట్ల అసలు వెలగడం లేదు. దీంతో రాత్రి పూట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మురుగు కాలువల్లో సరిగ్గా పూడికలు తీయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు. అధికంగా మట్టిరోడ్లు ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారి రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కుళాయిల ద్వారా నీరు సరఫరా అవుతున్నా అవి ఫ్లోరైడ్‌వి కావడంతో స్థానికులు ఫ్లోరోసిస్ బారిన పడుతున్నారు. అలాగే రోడ్లన్నీ చిల్లచెట్లమయంగా మారాయి. కొన్నిచోట్ల సీసీరోడ్లు వేసిన వాటి పక్కా కాలువలు లేకపోవడంతో మురుగంతా రోడ్డు మీద పారుతోంది. గత ప్రభుత్వం హయాంలో గడప గడపకు, 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరైనా అవి ఎక్కడ ఖర్చు చేశారో మాత్రం ఎవరికీ తెలియదు. ఇక్కడ వెతికినా కూడా అభివృద్ధి కనిపించవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తూరు అభివృద్ధికి పాటు పడాలని కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ కె.దానియేల్ జోసెఫ్‌ను వివరణ కోరగా.. అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



మురుగు నిలిచిన కుళాయి వద్ద నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం

ఘనంగా ఎంపీ మాగుంట జన్మదిన వేడుకలు

దర్శి, న్యూస్‌టుడే: ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పుట్టినరోజు వేడుకలు దర్శిలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కౌన్సిల్ వీసీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ పాల్గొని కేకు కోసి మాగుంటకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పాపారావు, నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

టీకాలతో వ్యాధుల వ్యాప్తి నివారణ

టంగుటూరు, న్యూస్‌టుడే: తొలకరి చినుకుల సమయంలో పశువుల్లో వ్యాప్తి చెందే దొమ్మ రోగం నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీ రాణి వైద్యులకు సూచించారు. మండలంలోని జమ్ములపాలెంలో దొమ్మరోగం నివారణకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు వ్యాక్సిన్ అందించారు. పశువులకు పాకలు లేని రైతులు గోకులం పథకం ద్వారా షెడ్లు పొందాలని తెలియజేశారు. అనంతరం గ్రామంలో గోకులం షెడ్లకు ఎంపికైన లబ్ధిదారులతో మాట్లాడారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని కనిగిరి డివిజనల్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనం చేసే ముందు విధిగా చేతులను కడుక్కోవాలని చెప్పారు. గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి, ఏపీవో వాక్యావతి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డివిజనల్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రపంచ మేధావి అబ్దుల్ కలాం

కనిగిరి, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రపంచ మేధావి అని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్ షేక్ అబ్దుల్ గఫార్, డానియేల్ జోసెఫ్‌లు కొనియాడారు. స్థానిక పురపాలిక కార్యాలయంలో మంగళవారం డా.ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి రాష్ట్రపతిగా ఆయన చేసిన సేవలు మరవలేవన్నారు. కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, ఏఈ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, దేవకి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ❖ కురిచేడు గ్రంథాలయంలో మంగళవారం కలాం జయంతిని నిర్వహించారు. ❖ దర్శి నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో గొట్టిపాటి లక్ష్మి పాల్గొని కలాం సేవలను కొనియాడారు. ❖పామూరులో స్వయంకృషి సేవా సంస్థ కార్యాలయంలో కలాం జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు.



కనిగిరి: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసెఫ్



రజానగరం దోర్నపువాగులో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దారు, సిబ్బంది



ముండ్లమూరు: మారెళ్ల ఈదరవాగు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎస్సై నాగరాజులు

పొంగిన వాగులు.. మునిగిన పంటలు

న్యూస్‌టుడే బృందం: అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. చాలాచోట్ల జనజీవనం స్తంభించింది. కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. తాళ్లూరులో వరి పంట నేలవాలింది. కనిగిరి పట్టణంలో ప్రధానంగా పట్టణంలో గార్లపేటరోడ్డు, ఉప్పురోడ్డు, కందుకూరు రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లోని వర్షపు నీరు నిలిచింది. దర్శి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న వాగులు, వంకలు పొంగాయి. చిలకలేరుల వద్ద వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించింది. వితలాపురం, రజానగరం, దోసకాయలపాడు వద్ద ఉన్న వాగుల్లో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో అధికారులు ఆయా గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. ఆప్రాంతాల వద్ద పోలీసు, రెవెన్యూశాఖలకు చెందిన సిబ్బందిని కాపలగా ఉంచి ప్రమాదాలకు తావులేకుండా ఏర్పాట్లు చేశారు. మారెళ్ల చప్టాపై నుంచి రెండు అడుగుల మేరు నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకుండా అధికారులు రెండు వైపులా కంచె ఏర్పాటు చేశారు.



తాళ్లూరు: వాలిన వరి చేను



కనిగిరి: చాకిరాల వద్ద కంది పంటలో చేరిన వర్షపు నీరు

కుక్కల పట్టివేత

స్పందనకు వందనం

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీలో మంగళవారం కుక్కలను పట్టించారు. పంచాయతీ పరిధిలో కుక్కల బెడదపై ఈ నెల 12వ తేదీ 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శేషమ్మ సిబ్బంది చేత కుక్కలను పట్టించి దొర్నాల సమీపంలోని అడవుల్లో వదిలారు.

జిల్లా కలెక్టర్‌తో గొట్టిపాటి లక్ష్మి భేటీ

దర్శి, న్యూస్‌టుడే: దర్శి తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలిశారు. గత రెండు రోజులుగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పల్లె పండగలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి లక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వ పరంగా ఆటంకాలు తొలగించేలా చూడాలని కోరారు. దర్శి నగరపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: కనిగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తెలుగు యువత మండల అధ్యక్షుడు బత్తుల రమణయ్య విరాళం అందజేశారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని ఆయన నివాసంలో కలిసి రూ.10వేల నగదును మంగళవారం అందజేశారు.

రెవెన్యూ కార్యాలయం తనిఖీ

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే : మండలంలోని రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం కనిగిరి ఆర్డీవో కె.కేశవర్ధన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఫ్రీహోల్ భూముల ఆన్‌లైన్ పారదర్శకంగా ఉండాలని సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం ఫ్రీహోల్ రికార్డులు పరిశీలించి 20 ఏళ్లకు ముందున్న భూములు మాత్రమే ఆన్‌లైన్ చేయాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు

సి.ఎస్.పురం: సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కనిగిరి ఏడీఏ ఎగ్గోని వెంకటరమణ తెలిపారు. మండలంలోని బోయమడుగుల, సి.ఎస్.పురం గ్రామాల్లో, పామూరు మండలంలోని అనుమునికొండ, నుచ్చుపొద గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకుని సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏవో కె.రాధ, సిబ్బంది పాల్గొన్నారు. ❖ దర్శి మండలంలోని బసిరెడ్డిపల్లి, చందలూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ❖ జరుగుమల్లి మండలం యడ్లూరిపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు మొక్కజొన్న, మిరప, పత్తి పంటలను పరిశీలించారు.



సీఎస్ పురంలో వరి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరమణ

ఎడతెగని వానలు.. ఆందోళనలో రైతన్నలు..



❖ టార్పాలిన్ పట్టలకు గత ప్రభుత్వం మంగళం



పోలవరం వద్ద ఎరువుల బస్తాలతో కుట్టిన పట్టలను పంట తడవకుండా కప్పిన దృశ్యం

కనిగిరి, న్యూస్‌టుడే:

కనిగిరి మండలం చినఇర్లపాడుకు చెందిన రైతు చవిడి రెడ్డి కల్లంలో సజ్జ కంకులు ఆరబోశారు. తన వద్దనున్న చాలీచాలనీ రంధ్రాలు పడిన టార్పాలిన్ పట్టను కప్పడంతో ప్రస్తుతం కురుస్తున్న వానలకు రైతు కష్టమంతా వర్షార్పణమైంది. తడిసిన కంకులు నల్లగా మారి నూర్పిళ్లకు కూడా పనికి రాకుండా పోయాయి. ఈ ఒక్క రైతే కాదు జిల్లాలోని అనేక అన్నదాతలది ఇదే పరిస్థితి. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పట్టలు అందుబాటులో లేక కల్లాల్లో ఉన్న పంటను ఎలా దాచుకోవాలో అర్థం కాక వారు తలలు పట్టుకుంటున్నారు.

గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ శాఖకు సంబంధించి అనేక పథకాలకు మంగళం పాడింది. అందులో అత్యంత ప్రయోజనకరమైనది పట్టల పంపిణీ. వర్షాకాలంలో ఏ పంట నూర్పిళ్లు చేసుకోవాలన్నా, తడవకుండా పంటలను కాపాడుకునేందుకు ప్రతి రైతుకు పట్టల అవసరం. 2018 వరకు అప్పటి తెదేపా ప్రభుత్వం 50 శాతం రాయితీపై పట్టలు రైతులకు అందజేసింది. ఒక్కొక్కరికి రెండేసి పట్టలు ఇవ్వడంతో మూడేళ్ల పాటు వాటిని ఉపయోగించుకున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టల పంపిణీని నిలిపేసింది. అప్పటి నుంచి కర్షకులు ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇవి ఎలాంటి నాణ్యత ఉండటం లేదు. త్వరగా చినిగిపోతున్నాయి. చిన్న, సన్నకారు రైతులు అయితే సిమెంట్, రసాయనిక, దాణా ఇతర బస్తాలతో తయారు చేసిన సాధారణ పట్టలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి చిన్నపాటి వర్షం కురిసినా నీరు చేరి పంట తడిసిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కనిగిరి, వెలిగండ్ల, దర్శి, మర్రిపూడి తదితర ప్రాంతాల్లో కల్లాల్లో ఆరబెట్టి ఉన్న సజ్జ కంకులు తడిసిపోయి మొలకలెత్తాయి.



ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన కంకులు

బాడుగకు తెచ్చుకుంటున్నారు..

ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో ఖరీఫ్ పంట చేతికొస్తుంది. దాన్ని కోసి కల్లాల్లో ఆరబెట్టి విపణిలో విక్రయిస్తారు. అయితే ఆరునెలల పాటు నూర్పిడి చేసిన పంటను జాగ్రత్తగా నిల్వ ఉంచుకోవాలి. అలాంటి సమయంలో అకాల వర్షాలు పడితే కాపాడుకోవడానికి పట్టలు అత్యవసరం. సన్న, చిన్నకారు రైతులు ఆర్థిక ఇబ్బందులు దృష్ట్యా స్వతహాగా మార్కెట్‌లో రూ.7 వేలు ఖర్చు చేయడం కష్టతరమౌతుంది. కొందరు రైతులు బాడుగకు తెచ్చుకుని ఉపయోగించుకుంటున్నారు. అయితే ఈ భారం మోయలేక రాయితీపై ఇచ్చే వాటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

జిల్లాలో అత్యధికంగా కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోనే టార్పాలిన్ పట్టలను రైతులు వాడేది. సజ్జ, మినుము, శనగ, కంది ఇతర పంటలకు సాగు ఎక్కువ, పైగా ఈ కాలంలోనే కొన్ని పంటలు కోతలు కోసి కల్లాల్లో వేస్తుంటారు. రైతులు డిమాండ్ మేరకు పట్టలు అందించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. రాగానే పంపిణీ చేస్తాం.

– ఈవీ రమణ, కనిగిరి ఏడీఏ

బాలికల వసతి గృహాలకు లభించనున్న మోక్షం

తాళ్లూరు, న్యూస్‌టుడే:

బాలికల్లో డ్రాప్ అవుట్స్‌ను నివారించడంతోపాటు వారిలో విద్యా ప్రోత్సాహకంగా ఉండాలన్న లక్ష్యంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో జిల్లాకు అయిదు వసతిగృహాలను (కేజీబీవీ టైప్-4) మంజూరు చేసింది. 2018 సంవత్సరం చివరలో ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.1.94 కోట్ల వంతున నిధులు మంజూరు చేసింది. దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు, దొనకొండ, కనిగిరి నియోజకవర్గం సీఎస్‌పురం శీలంవారిపల్లెల్లో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు చొరవతో స్థలాలు సమకూర్చి వెంటనే టెండర్లు ఖరారు చేశారు. కురిచేడుకు స్థలం సమకూరక పోవడంతో అక్కడ నిర్మాణాలు చేపట్టలేదు. 2019 ఏడాది ఆరంభంలో శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. గుత్తేదారులు ఉత్సాహం చూపి నిర్ణయించిన కాలం లోపుగానే వసతిగృహ నిర్మాణాలను పూర్తి చేశారు. కొద్దిపాటి చిన్నచిన్న పనులే మిగిలి పోగా.. వాటిని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా అవి ప్రారంభానికి నోచుకోలేదు.



తాళ్లూరులో నిర్మాణం పూర్తయిన బాలికల వసతిగృహం

కక్షపూరితంగా వ్యవహరించిన వైకాపా..

గత అయిదేళ్లు రాష్ట్రంలో పాలన సాగించిన వైకాపా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించింది. తెదేపా ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో అవి క్రమేపీ శిథిలమయ్యాయి. తాళ్లూరు భవనంపై ఏకంగా చిల్లచెట్లు మొలిచి భవనం గోడపైకి పెరిగిపోయాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవనాలు ప్రారంభంపై దృష్టి సారించింది. ఈ కోవలో మూడు వసతిగృహాల్లో మంచినీటి సౌకర్యానికి, మిగిలిపోయిన చిన్నపాటి పనులు పూర్తికి గత నెల్లో రూ. 30 లక్షలు నిధులు మంజూరు చేసి ఏఈల పర్యవేక్షణలో పనులు చేపట్టాలని ఆదేశించింది. అలాగే ఒక్కో వసతిగృహంలోని అవసరాలకు అనుగుణంగా వంట మనిషి, సహాయకురాలు, వాచ్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులను స్వీకరించారు. ఆప్రక్రియ పూర్తయితే వెంటనే ఆయా వసతిగృహాలను ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో వీటిని తెరిపించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అన్ని అనుకున్నట్లు జరిగితే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ విద్యనభ్యసించే బాలికలు ప్రయోజనకరంగా ఉంటుంది. ఒక్కో వసతి గృహంలో 200 వంతున మూడింటిలో 600 మంది విద్యార్థినులకు అవకాశం లభిస్తుంది.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

నీట మునిగిన పంటలు


మిరప తోటలో చేరిన నీరు

వర్షాల కారణంగా నాగులుప్పలపాడు మండలంలోని హను మాపురం, నాగన్న వాగులు పొంగి పొర్లాయి. మట్టిగుంట వాగు ఉద్ధృతికి ఉప్పుగుండూరులోని గంగమ్మ కూడలి జలమయమైంది. ఎస్సీ కాలనీలో ముంపు ప్రాంతాన్ని ఎంపీడీవో మహాలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. నాగులుప్పలపాడులో మిరప, టమాటా, మినుము, సజ్జ పంటలు నీట మునిగాయి.
– న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు

న్యాయసేవలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది ధనలక్ష్మి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థలో మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు ఉన్నాయని... సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది ధనలక్ష్మి పేర్కొన్నారు. విధాన్‌సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. లైంగిక వేధింపులు, వివక్ష వంటివి ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలన్న అంశంపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయసేవలు పొందే విధానాన్ని తెలియజేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. డీపీఎం నరసింహారావు, ఏపీఎం నరేంద్రకుమార్, శిశు సంక్షేమశాఖ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వైకాపా వైఫల్యం... నగరానికి శాపం

• ఓట్ల కోసం ఎన్నికలకు ముందు టెండర్లు • బిల్లుల భయంతో సాగని కాలువల నిర్మాణం • వాన పడితే తప్పని ముంపు భయం

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

అప్పటి వరకు నగర సమస్యలు పట్టించుకోని వైకాపా ప్రభుత్వం. ... ఎన్నికల ముందు హడావుడి చేసింది. 2023–24 మధ్య ఏకంగా 132 కాలువల నిర్మాణానికి రూ.19.22 కోట్లతో టెండర్లు పిలిచింది. పనులు దక్కించుకున్న వారిలో చాలా మంది వైకాపా నాయకుల అనుయాయులే అయినా... బిల్లుల భయంతో ఎవరూ పనులు ప్రారంభించలేదు. 69 నిర్మాణాలు మొదలు పెట్టినట్లు చూపినా నేటికీ అవి సా...గుతూనే ఉండడం గమనార్హం.

గత వైకాపా పాలకులు కాలువల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించారు. నగరంలోని మురుగు, వరద నీటిని బయటకు తరలించే పోతురాజు, నల్లకాలువల నిర్వహణనూ గాలికొదిలేశారు. వర్షం పడిన ప్రతిసారీ సమస్యలు తలెత్తినా కనీస స్థాయిలోనూ పట్టించుకోలేదు. పలు కాలనీల వారు, వామపక్షాల నాయకులు ఆందోళనలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఎన్నికల ముందు టెండర్లు పిలిచి హడావుడి చేసినా... బిల్లుల భయంతో పనులేవీ ప్రారంభం కాలేదు. పేరుకు కొన్నిచోట్ల మొదలు పెట్టినా నేటికీ పూర్తికాలేదు. ఆ వైఫల్యం ఇప్పుడు నగరవాసులకు శాపంగా మారింది.

హడావుడి చేసి వదిలేశారు...

కొప్పోలు రోడ్డులో కాలువ నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.60 లక్షలతో టెండర్లు పిలిచినా ఇంతవరకు పనులు మొదలు కాలేదు. దీంతో పులి వెంకటరెడ్డి కాలనీ, ఇందిరా కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఎన్టీఆర్ కాలనీ, కొప్పోలు వాసులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. వాడుక నీరంతా ప్రధాన రహదారిపైకి చేరడంతో వాహనదారులూ అవస్థలు పడుతున్నారు. డీమార్ట్ ఎదుట నుంచి పొగాకు బోర్డు వరకు రూ.90 లక్షలతో నిర్మించాల్సిన కాలువదీ ఇదే తీరు. ఈ కారణంగా భాగ్యనగర్, ధారావారికుంట ప్రాంతాలు జలమయమవుతున్నాయి. అంతకు ముందు రూ.50 లక్షలతో టెండర్లు పిలిచిన మూడు పనులూ ఇంతవరకు చేపట్టలేదు. కొన్ని పనులు ప్రారంభించినా... బిల్లులు కాక మధ్యలోనే ఆగిపోయాయి.

గత మూడేళ్లలో కాలువ పనుల తీరిది...

సంవత్సరం	నేటికి సాగుతున్న పనులు	మొత్తం (రూ.కోట్లలో)	ఇంకా మొదలుకానివి	విలువ (రూ.కోట్లలో)
2022	2	0.40	3	0.50
2023	20	4.20	12	1.84
2024	49	5.20	51	7.98

పురపాలక శాఖ మార్గదర్శకాల ప్రకారం కాలనీల్లో కాలువలు నిర్మించాకే రోడ్డు పనులు చేపట్టాలి. గత పాలకులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. బిల్లుల భయం లేని, ఎక్కువ ఆదాయం మిగిలే గ్రావెల్ రోడ్డు, గుంతలు పూడ్చే పనులకు ప్రాధాన్యమిచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

పేరుకే నిర్మాణాలు...

కాలువలు నిర్మించేటప్పుడు ఎత్తుపల్లాలు, ఇతరత్రా అడ్డంకులు లేకుండా పనులు చేపట్టాలి. అప్పుడే మురుగు సాఫీగా దిగువకు పారుతుంది.


ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో పరిస్థితి...

పట్టణ ప్రణాళిక, శానిటరీ విభాగం అధికారులు సమన్వయంతో వ్యవహరించి... ఆ మేరకు పనులు జరిగేలా పర్యవేక్షించాలి. ఆయా శాఖల మధ్య సమన్వయం లేక.. కట్టిన కొద్దిపాటి కాలువలనూ ఇష్టారీతిన నిర్మించారు. ఈ కారణంగానే వెంకటేశ్వరకాలనీ, మంగమూరు రోడ్డు, వీఐపీ రోడ్డు, గోపాలనగర్ ప్రాంతాల్లో పేరుకు కాలువలున్నా.. మురుగు మాత్రం ముందుకు సాగడం లేదు.

తొలి ప్రాధాన్యమిస్తాం...

గతంలో టెండర్లు దక్కించుకున్న వారు పనులు మొదలు పెట్టలేదు. వారితో మాట్లాడి వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఇకపై కేటాయించే నిధుల్లోనూ కాలువలకే తొలి ప్రాధాన్యమిస్తాం. ఆ పనులు పూర్తయ్యాకే రహదారుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
– కె.వెంకటేశ్వరరావు, కమిషనర్

రేపు మహర్షి వాల్మీకి జయంతి

ఒంగోలు గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17న ఉదయం పది గంటలకు ప్రకాశం భవన్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఎం.అంజల తెలిపారు. వాల్మీకి సంఘ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సీతారామపురంలోని వృద్ధాశ్రమంలో జనసేన నాయకులు అన్నదానం నిర్వహించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు కల్యాణ్ ముత్యాల, చంగలశెట్టి రాఘవ, అంకబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహానికి స్థలం కేటాయించాలని వినతి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి పోలీసు ప్రాంగణంలోని జాతీయ నాయకుల విగ్రహాల వద్ద గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని... అభయ కళారాధన సంస్థ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణను మంగళవారం కలిసి విన్నవించారు. సంస్థ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు, మనోజ్, ప్రశాంత్, శ్రీధర్, చిరంజీవి పాల్గొన్నారు.


కొత్తమామిడిపాలెం రోడ్డులోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ సుజాత

రేపటి నుంచి కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలో కుక్కల బెడద నివారణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటి సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఓ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. గురువారం నుంచి వారు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. కొత్తమామిడిపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్, సంరక్షణ కేంద్రాన్ని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత మంగళవారం పరిశీలించారు. శస్త్రచికిత్సల అనంతరం అయిదు రోజుల పాటు ఈ కేంద్రంలోనే ఉంచి పర్యవేక్షిస్తారు. అనంతరం వాటిని ఎక్కడ పట్టారో అక్కడే విడిచిపెడతారని కమిషనర్ తెలిపారు.

హమ్మయ్య... కాలువలు తెరుచుకున్నాయ్!

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షం పడినా కర్నూలు రోడ్డు కాలువలా మారిపోతోంది. ముఖ్యంగా బస్టాండ్ కూడలి నుంచి పాత మార్కెట్ వరకు మోకాలి లోతున నీరు నిలిచి... రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇరువైపులా కాలువలు ఉన్నా... దుకాణదారులు వాటిపై ర్యాంపులు నిర్మించడంతో సమస్య నెలకొంటోంది. భారీ వర్షాల నేపథ్యంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఈ విషయమై దృష్టి సారించారు. మంగళవారం... రోడ్డుకు ఇరువైపులా ఉన్న ర్యాంపులను జేసీబీలతో తొలగించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పూడిపోయిన కాలువలను బాగు చేయించారు.


బాపూజీ మార్కెట్ ఎదుట కాలువలపై ర్యాంపుల తొలగింపు

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి


జర్నలిస్టు కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కొప్పోలు రోడ్డులోని జర్నలిస్టు కాలనీలో మంగళవారం పర్యటించారు. వాగులు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అడ్డంకులు తొలగించాలన్నారు. సముద్ర తీర గ్రామాల్లో 15 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి... వాటిలో అయిదు ప్రారంభించి భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో చేతుల శుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మద్దిపాడు పంచాయతీ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు... చేతులు శుభ్రం చేసుకునే విధానాలు వెలుగు ఏపీఎం సుబ్బారావు తెలియజేశారు. తద్వారా ఆరోగ్యంతో పాటు పలు ఇతర ప్రయోజనాలూ కలుగుతాయని వివరించారు. సీసీలు వెంకట్రావు, వెంకట సుబ్బయ్య, లక్ష్మీ అరుణ, శకుంతల, వీవోఏలు పాల్గొన్నారు.



నిలిచిన రాకపోకలు

భారీ వర్షాలకు ముదిగొండ వాగు పొంగి కరవది - గుత్తికొండవారిపాలెం మధ్య చప్టాపై పారుతుండడంతో మంగళవారం ఆ దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైన వారు త్రోవగుంట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది.
– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సూర్యనగర్ ప్రధాన రహదారిపైకి పశువుల వ్యర్థాలు చేరి సమస్యగా మారింది. – జి.శ్రీనివాసరావు, చీమకుర్తి

✓: వెంటనే శుభ్రం చేయిస్తాం.
– వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్

జీజీహెచ్ వైద్యుడి ఇంట్లో చోరీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్బారావు ఇంట్లో చోరీ జరిగింది. 22 సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దొంగలు ఎత్తుకుపోయారు. ఈ నెల 13న బాపట్లలో ఓ శుభకార్యానికి కుటుంబసభ్యులంతా కలిసి వెళ్లారు. రాత్రి పది గంటలకు తిరిగి ఒంగోలు వచ్చారు. ప్రయాణ బడలికలో బంగారు ఆభరణాలు ఉన్న సంచిని హాలులోనే మరచిపోయి నిద్రించారు. తరువాతి రోజు ఉదయం చూడగా నగల సంచి కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఒంగోలు తాలూకా పోలీసులు తెలిపారు.

మురుగు నిలిచి ఇక్కట్లు



మంగమూరు రోడ్డులో ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఆ మార్గాన్ని ఆనుకుని ఉన్న కాలనీల నుంచి వచ్చే మురుగు బయటకు పోయేదారి లేక సమస్య నెలకొంటోంది. రహదారికి ఇరువైపులా కొంతమేర నిలిచి... మిగతా వెనక్కు ఎగదన్నుతుండడంతో చిక్కులు తలెత్తుతున్నాయి. సరస్వతి కళాశాల వెనుక వీధిలో ఇలాగే మురుగు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని అంజమ్మ అనే మహిళ వాపోయారు. దుర్వాసనతో పాటు దోమల సమస్య పెరుగుతోంది. ఆయా కాలనీల్లోనూ అంతర్గతదారులు సైతం సరిగా లేవని స్థానికులు తెలిపారు.
– న్యూస్‌టుడే, మంగమూరు రోడ్డు (ఒంగోలు అంజయ్య రోడ్డు)

శ్రీనగర్ కాలనీలో చీకట్లు!



45వ డివిజన్ పరిధి శ్రీనగర్ కాలనీలో గత మూడు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. కాలనీలోని మొత్తం నాలుగు లైన్లలోనూ ఇదే పరిస్థితి ఉండడంతో... రాత్రి వేళ అంధకారం నెలకొని రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. కాలువలు సైతం సరిగా శుభ్రం చేయడం లేదని... తొలగించిన వ్యర్థాలు సైతం రోజుల తరబడి వదిలేస్తుండడంతో సమస్య నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములు, విష కీటకాలు సంచరిస్తుండడంతో బయటకు రావాలంటేనే భయపడుతున్నామని వాపోయారు.
– న్యూస్‌టుడే, శ్రీనగర్ కాలనీ (ఒంగోలు అంజయ్య రోడ్డు)

పన్నుకు సున్నం.. ఖజానాకు కన్నం



◗ విధింపులో సిబ్బంది చేతివాటం
◗ వైకాపా పాలనలో ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం :

చేయి తడపగానే అంకె మారిపోయింది. రూ.వేలల్లో పడాల్సిన పన్ను కాస్తా వందల్లోకి వచ్చేసింది. కొందరు అధికారులు, వైకాపా ప్రజాప్రతినిధులు కుమ్మక్కై గిద్దలూరు నగర పంచాయతీ ఖజానాను గుల్లచేసేశారు. పనిలో పనిగా తమ బంధువులకు కూడా నామమాత్ర పన్ను వేసి పెద్ద మనస్సు చాటుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

గిద్దలూరు నగర పంచాయతీలో ఆస్తిపన్ను విధింపు ఇష్టారాజ్యంగా సాగింది.. వైకాపా పాలనలో పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది అందినదంతా దోచుకున్నారు. ఆ పార్టీ నేతల ఇళ్లకు నామమాత్రంగా విధించి చేతులు దులుపుకున్నారు. కొందరు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆడిన నాటకంతో నగర పంచాయతీ ఆదాయానికి భారీ గండిపడుతోంది.

అన్నీ మతలబులే..

పన్ను వేసే సమయంలో సిబ్బంది నిబంధనలకు గంతలు కట్టారు. భవన నిర్మాణ విస్తీర్ణం తక్కువ చూపి లబ్ధి పొందారు. ఇక బహుళ అంతస్తులున్నప్పటికీ తక్కువగా చూపి నగర పంచాయతీకి ఆర్థికంగా నష్టం చేకూర్చారు. నగర పంచాయతీలోని శివారు ప్రాంతాల్లో నూతన భవనాల నిర్మాణాలు చేపట్టి వినియోగించుకుంటున్నప్పటికీ నేటికీ పన్ను వేయకుండా మిన్నకుండిపోతున్నారు. వాణిజ్య భవనాలకు నివాస గృహాల కింద పన్ను విధించడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇలాంటి ఎన్నో మతలబులు పట్టణంలో అడుగడుగునా కన్పిస్తున్నాయి.

◗ గిద్దలూరు - ఒంగోలు రహదారిలోని శిల్పా రెస్టారెంట్ సమీపంలో ఓ కౌన్సిలర్ కుటుంబ సభ్యులు నాలుగంతస్తుల భవనం నిర్మించారు. అయితే ఆ భవనానికి నగర పంచాయతీ రెవెన్యూ సిబ్బంది కేవలం గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుకు మాత్రమే అర్ధ సంవత్సరానికి నామమాత్రపు పన్ను వేశారు. మిగతా రెండు అంతస్తులకు పన్ను వేయకుండా నగర పంచాయతీ ఆదాయానికి గండికొట్టారు.

◗ గిద్దలూరు - ఒంగోలు రహదారిలో ఓ శీతల గోదాం నిర్మాణం ఆరు అంతస్తుల్లో చేపట్టారు. అయితే పన్ను వేసే సమయంలో నగర పంచాయతీ రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తక్కువ అంతస్తులు చూపడంతో పాటు విస్తీర్ణాన్ని తగ్గించి పన్ను వేసి నగర పంచాయతీ ఆదాయానికి నష్టం చేకూర్చారు.

◗ గిద్దలూరు నగర పంచాయతీలోని మెయిన్ బజారులో పలు గృహాలను వాణిజ్య దుకాణాలుగా మార్పు చేసినప్పటికీ నేటికీ అలాగే నివాసగృహాల కేటగిరీలోనే పన్నులు వసూలు చేస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



శిల్పా రెస్టారెంట్ సమీపంలో తక్కువ పన్ను వేసిన భవనం

తనిఖీలు చేపడితే..

గిద్దలూరు నగర పంచాయతీ అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో అసెస్‌మెంట్లను తనిఖీ చేస్తే రెవెన్యూ సిబ్బంది చేతివాటం బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి. అలాగే నగర పంచాయతీలోని పలు శివారు ప్రాంతాలపై దృష్టి సారిస్తే అక్రమాలు బయట పడనున్నాయి. ఉన్నతాధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలు మారుస్తాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆరు నెలల్లో గ్రామాల రూపురేఖలు మార్చుతామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఉలిచి, కరవది, చేజర్లలో రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చుతామన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వైకాపా హయాంలో భూ రీసర్వేలో దొర్లిన తప్పులు సరిచేయాలని చేజర్ల రైతులు, కరవది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని అక్కడి వారు కోరారు. ఉలిచిలో ఎత్తిపోతల పథకం విద్యుత్తు పరికరాల చోరీ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీడీవో రాజశేఖర్, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు పోలవరపు వెంకటరామయ్య, చుంచు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉలిచిలో సిమెంట్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, తెదేపా నాయకులు

నిరంతర పరిశోధనతో పరిజ్ఞానం పెంపు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు నిరంతర పరిశోధన, కొత్త విషయాలు తెలుసుకోవడం వల్ల పరిజ్ఞానం పెరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు అన్నారు. 2024 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం మంగళవారం ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమంలో తొలిరోజు ప్రిన్సిపల్ మాట్లాడారు. ముందుగా అన్ని వైద్య విభాగాల ప్రతినిధులను పరిచయం చేశారు. తరువాత కళాశాల, ఆసుపత్రి సందర్శన ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తల్లిదండ్రుల శ్రమ, వారి ఆలోచనలకు తగినట్లు ఎంబీబీఎస్ సీటు సాధించడమే కాక ప్రతిరోజు కొత్త విషయాలను అవగతం చేసుకోవాలన్నారు. నైపుణ్యం కలిగిన ఆచార్యులు అందుబాటులో ఉన్నారన్నారు. సామాజిక బాధ్యతగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో ఎన్‌రోల్ కావాలన్నారు. సీనియర్లు, జూనియర్ల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఏడుకొండలరావు

పొగాకు వినియోగం తగ్గించేందుకు విభాగం

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న సైకియాట్రిస్ట్ పోస్టుకు టెండర్లు పిలిచినా ఎవరూ ఆసక్తి చూపలేదని సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. 'వ్యసనానికి విముక్తి లేదిక్కడ' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనంపై స్పందించారు. మందులు ప్రభుత్వం నుంచి సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు రావాల్సి ఉందన్నారు. ఇటీవల పొగాకు వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, పొగాకు బారిన పడిన వారికి నికోటిన్ ఫ్రీ డ్రగ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. రోగుల లక్షణాలను బట్టి కొన్ని మందులు స్థానికంగా కొనుగోలు చేస్తామన్నారు. సిబ్బంది వేతనాలు వారి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. వైద్య కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు విచారణలో రుజువు కాలేదని ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు ఈ మేరకు ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ ప్రాంతంలో మద్యం దుకాణం వెంటనే తొలగించాలని స్థానికులు, మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కొండపి మద్దులూరు రోడ్డులో ఉన్న మద్యం దుకాణాన్ని తరలించి గొడుగుల పాలెంకు వెళ్లే మలుపు వద్ద ఓ భవనంలో ఏర్పాటు చేశారు. గుడి, బడి, చర్చి ఉన్న స్థలంలో బెల్లు షాపు ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించాలని కోరుతూ స్టేషన్‌లో అర్జీ అందించారు.

డీఎస్వోగా పద్మశ్రీ బాధ్యతల స్వీకరణ



ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణి(డీఎస్వో)గా పద్మశ్రీ మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె పల్నాడు డీఎస్వోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ప్రకాశానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేశారు. తొలుత డీఎస్వో పద్మశ్రీ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇటు సంస్కరణం.. అటు ప్రోత్సాహకం



● సంక్షోభం నుంచి గట్టెక్కేలా అడుగులు ● ప్రభుత్వం రాయితీలిస్తే గ్రానైట్‌కు ప్రాభవం

గత ప్రభుత్వ విధానాలతో కుదేలైన గ్రానైట్ పరిశ్రమ.. ఆ సంక్షోభం నుంచి గట్టెక్కే దిశగా అడుగులేస్తోంది. ఈ మేరకు యాజమాన్యాలు ఓ వైపు సంస్కరణ బాట పట్టింది. ఇదే సమయంలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు దరిచేరితే వేలాదిమంది కార్మికుల జీవితాల్లో వెలుగులీనడంతో పాటు ఖజానాకు ఆదాయం సమకూరే అవకాశముంది.



చీమకుర్తి పరిధిలో విస్తరించిన గ్రానైట్ ఫ్యాక్టరీలు

న్యూస్‌టుడే, చీమకుర్తి :

చీమకుర్తి, కంభంపాడు, బూదవాడ, మర్రిచెట్లపాలెం, పొదిలి మండలం ఏలూరు రోడ్డు ప్రాంతాల్లో దాదాపు 800కు పైగా గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలున్నాయి. సంతనూతలపాడు, ఒంగోలు, గుండ్లాపల్లి పారిశ్రామికవాడ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని కలుపుకుంటే ఈ సంఖ్య 1300కు పైనే ఉంటుంది. వైకాపా ప్రభుత్వం కొలువుదీరక ముందు ఓ వెలుగు వెలిగిన గ్రానైట్ పరిశ్రమ జగన్ హయాంలో ప్రాభవం కోల్పోయింది. దీంతో ఇటు యాజమాన్యాలతో పాటు కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. కొన్ని యూనిట్లు మూతపడ్డాయి. గిట్టుబాటు ధరలు లేక పరిశ్రమల్లో నిల్వలు పేరుకు పోతున్నాయి.

కొత్త దిశలో పయనిస్తూ..

గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో విద్యుత్తు బిల్లులు, ఈఎంఐలు, ఇతర నిర్వహణ ఖర్చులను కూడా భరించలేని స్థితి ఎదురైంది. దీంతో గత్యంతరం లేక వచ్చిందే ధర అన్న చందంగా యాజమాన్యాలు స్లాబులు అమ్మకాలు చేస్తున్నాయి. కొనుగోలుదారులు రింగ్ అవ్వడంతో వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చీమకుర్తి, కంభంపాడు, బూదవాడు, ఏలూరు రోడ్డు ప్రాంతాల గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘాలకు ఎన్నికైన కొత్త కార్యవర్గాలు పరిశ్రమకు ఆదివారాలు సెలవులు ప్రకటించాలని నిర్ణయించాయి. ఆమేరకు గత రెండు నెలలుగా అమలుచేస్తున్నారు. ఎడ్జి కటింగ్ యంత్రాలకు మెటీరియల్ ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. బిల్లుల విధానాన్ని పక్కాగా అమలుచేసేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

చవకగా విద్యుత్తు అందిస్తే..

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రానైట్ ఫ్యాక్టరీలకు విద్యుత్తును చవక ధరకు అందిస్తామని చీమకుర్తిలో పాదయాత్ర సందర్భంగా లోకేశ్ ప్రకటించారు. ఆయన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాక పరిశ్రమల ప్రతినిధులు కలిసి సమస్యలు విన్నవించారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన రాయితీలు, పావలా వడ్డీ మొత్తాలు, విద్యుత్తు రాయితీలను చెల్లింపచేసే దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు. ఇవన్నీ కార్యరూపం దాల్చితే గెలాక్సీపురి మళ్లీ కాంతులీనే అవకాశముంది.

వాగు కాదు.. కర్నూలు రాచబాట



యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద ఇదీ దుస్థితి



భారీ వర్షాలతో ఒంగోలు - కర్నూలు రహదారి వాగును తలపిస్తోంది. చీమకుర్తి యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద నాలుగడుగుల మేర నీరుండటంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వయంగా సూచించినా ఫలితం లేదు. గ్రానైట్, కంకర మిల్లుల యజమానులతో తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని చోదకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, చీమకుర్తి



ఇంజిన్లతో గుండ్లకమ్మకు నీటిని తరలిస్తున్న దృశ్యం

ఇంజిన్లతో వరద నీరు తొలగింపు

మద్దిపాడు, న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మద్దిపాడులో జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డులో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోయింది. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయమై 'కాలువలా మారిన హైవే' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన వార్తకు హైవే నిర్వహణ అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించారు. ఇంజిన్లు ఏర్పాటు చేసి ఆయా మార్గాల్లో నిలిచిన నీటిని బయటకు తోడించారు. సర్పంచి వెంకటేశ్వర్లు, కార్యదర్శి నూరుల్లా అధ్వర్యంలో వార్డు సభ్యులు నవులూరి శివ, నూనె శ్రీను, పురాలశెట్టి బ్రహ్మయ్య మూడు ఇంజిన్‌లు ఏర్పాటు చేశారు. జేసీబీతో మద్దిపాడు కూడలి నుంచి గుండ్లకమ్మకు నీరు పోయేలా కాలువ తవ్వారు. ఉదయం ఆరు నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ పనులు చేపట్టారు. తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు కడియాల రఘుబాబు, సుద్దపల్లి నరసింహారావు, అనిల్, వేల్పుల నాగరాజు, హరిబాబు, ఆంజనేయులు తమవంతు సహకారం అందించారు.



జేసీబీతో కాలువ తవ్వకం

కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ

మద్దిపాడు, న్యూస్‌టుడే: పల్లె పండగలో భాగంగా సీతారామపురంలో అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. రాజుల కాలనీలో రూ.10 లక్షలతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. సర్పంచి మండవ శివానందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ సుజన్ కుమార్, తెదేపా మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మారెళ్ల హరికుమార్, గోపీచంద్, కృష్ణంరాజు, అనిల్, చింతల శ్రీను, రఘు, వెంకట్రావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

వారంలోగా పరిహారం చెల్లింపునకు చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం నిర్మాణంలో భూ సేకరణ నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. అమరావతి నుంచి సంబంధిత రైలు మార్గం వెళ్తున్న జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. కనిగిరి, పామూరు మండలాల్లో పరిహారం చెల్లింపులో జాప్యంపై ఆరా తీశారు. వారంలోపు సదరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం భూ సేకరణ విభాగం పర్యవేక్షకులు సంజీవరావుతో కలెక్టర్, జేసీ సమీక్ష నిర్వహించారు.

కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

కొత్తపట్నం: భారీ వర్షాల నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు మెరుగైన వసతులతోపాటు, నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కొత్తపట్నంలోని జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం రాత్రి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు సమకూర్చిన వసతుల గురించి తెలుసుకున్నారు. భోజన సదుపాయాలు ఎలా ఉన్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావం తొలిగే వరకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు. బుధవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా రెండు కేంద్రాల్లో 75 మంది ఆశ్రయం పొందుతున్నట్లు తహసీల్దార్ పి.మధుసూదనరావు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు తెలిపారు. వారి కి 24 గంటలు వైద్యసేవలు అందించేలా శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు ఉన్నారు.



కొత్తపట్నం పునరావాస కేంద్రంలో సదుపాయాల గురించి ఆరాతీస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మంత్రి సత్యకుమార్ పర్యటన వాయిదా

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ నెల 17న యర్రగొండపాలెం కొలుకులలో నిర్వహించే పర్యటన వాయిదా పడినట్లు భాజపా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు ఆరె.రమణయ్య మంగళవారం తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంత్రి పర్యటన నవంబర్ రెండో వారానికి వాయిదా పడినట్లు ఆయన చెప్పారు.

అనుమతిలేని గ్రానైట్ కంటెయినర్ల పట్టివేత

ఒంగోలు, ఈనాడు : చీమకుర్తి మండల పులికొండ, ఆర్ఎల్‌పురం ప్రాంతాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి తగిన అనుమతి పత్రాలు లేకుండా గ్రానైట్ స్లాబ్‌లను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు కంటెయినర్లను పట్టుకున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తగిన వేబిల్లులు లేకుండా ఆయా ఫ్యాక్టరీల నుంచి గ్రానైట్ స్లాబులను రవాణా చేస్తున్న ఈ వాహనాలను స్వాధీనం లోకి తీసుకున్నామన్నారు. సహాయ జియాలజిస్టు సురేష్ కుమార్ రెడ్డి, సాంకేతిక సహాయకులు కృష్ణారెడ్డి, రాజు నాయుడు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం.. దోషికి పదేళ్ల కారాగారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడి.. ఆపై అపహరించి పెళ్లి చేసుకున్న నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 15,000 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత కథనం ప్రకారం.. సింగరాయకొండ ప్రాంతానికి చెందిన మండే అనిల్ (22) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలో తాపీ మేస్త్రీగా స్థిరపడ్డాడు. 2019లో ప్రేమ పేరిట ఓ బాలిక(16)ను మభ్యపెట్టి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కొన్నిరోజుల తర్వాత ఆమెను అపహరించి వనస్థలిపురంలోని ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో వనస్థలిపురం పోలీసులు.. అత్యాచారం, అపహరణ, పోక్సో కేసులు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తుది తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.10 లక్షలు పరిహారాన్ని మంజూరుచేశారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాధితురాలి వైద్యం, పునరావాసానికి వినియోగించాలని తీర్పులో పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఉపాధ్యాయురాలికి జైలు

కనిగిరి, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితురాలు కుమ్మరికుంట ప్రమీలకు రూ.8 లక్షల జరిమానా, ఏడాది జైలుశిక్ష విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర తీర్పునిచ్చారు. కనిగిరి మండలం గురవాజీపేటకు చెందిన ఉపాధ్యాయురాలు ప్రమీల బొమ్మిరెడ్డిపల్లికి చెందిన తూము ఆదిరెడ్డి వద్ద రూ. 5.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఈ నగదు చెల్లించే నిమిత్తం రూ.8 లక్షలకు చెక్కును తిరిగి ఆదిరెడ్డికి ఇచ్చారు. అది బ్యాంకులో చెల్లకపోవడంతో బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగళవారం ఈ కేసు విచారణకు రాగా, ఆమెపై నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తు తీర్పునిచ్చారు.

మరో కేసులోనూ ఆమెకు శిక్ష

కుమ్మరికుంట ప్రమీలకు మరో కేసులోనూ శిక్ష విధించారు. వెలిగండ్ల మండలం తమ్మినేనిపల్లికి చెందిన తమ్మినేని ఫణీంద్ర నుంచి గతంలో ఆమె రూ. 3.25 లక్షలు అప్పుగా తీసుకున్నారు. దీని తాలూకా అసలు, వడ్డీతో సహా రూ. 5 లక్షల చెక్కును ఆమె అందజేయగా, అది కాస్తా బౌన్స్ అయ్యింది. దీంతో నిందితురాలు ప్రమీలకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 లక్షలు పరిహారం విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్రతీర్పు నిచ్చారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 157, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 259